Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అధునాతన సాంకేతికతతో.. ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు మీ ముందుకు వచ్చిన

ప్రజా టెలివిజన్

యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు. నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..

సంప్రదించండి: 8309979541, 9494659622

PRAJA TELEVISION The People's Favour

మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి 8309979541

ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 158 | హైదరాబాద్ | శుక్రవారం 01 మే 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# సముద్రంలో ముంచేస్తాం

## పర్షియన్ గల్ఫ్‌లో అమెరికన్లకు పనేంటి?





- ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ప్రశ్న
- అణు సామర్థ్యాలను కాపాడుకుంటామని ఉద్ఘాటన
- హర్మూజ్‌పై తమ నియంత్రణ కొనసాగుతుందని స్పష్టీకరణ
- జలసంధిని తెరిచేందుకు కొత్త ప్రణాళికను ప్రతిపాదించిన ట్రంప్

దుబాయ్: అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. శాంతి చర్చలు దాదాపుగా అటకెక్కిన వేళ.. ఇరు దేశాల మధ్య విభేదాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. అణ్వస్త్ర తయారీ ప్రణాళికలను వదులుకోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్‌కు టెహ్రాన్ ససేమిరా అంటోంది. తమ అణు, క్షిపణి సామర్థ్యాలను జాతీయ సంపద తరహాలో కాపాడుకుంటామని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తాజాగా ఉద్ఘాటించారు. హర్మూజ్‌పై తమ నియంత్రణ కొనసాగుతుందని, అందుకోసం కొత్త నిబంధనలు తీసుకొస్తామని స్పష్టం చేశారు. పర్షియన్ గల్ఫ్‌కు వచ్చే అమెరికన్లను సముద్రంలో ముంచేస్తామని హెచ్చరించారు. చమురు ధరలు భారీగా పెరుగుతుండటంతో ఒకింత ఒత్తిడి ఎదుర్కొంటున్న ట్రంప్.. హర్మూజ్‌ను తిరిగి తెరిచేందుకు కొత్త ప్రణాళికను ప్రతిపాదించారు. దాని ప్రకారం– ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని అమెరికా కొనసాగిస్తుంది. అదే సమయంలో.. ఇంధన స్వేచ్ఛా ప్రవాహానికి విఘాతం కలిగించే ప్రయత్నాలకు టెహ్రాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చేలా మిత్రపక్షాలను సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపడుతుంది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర గురువారం ఏకంగా 126 డాలర్లకు ఎగబాకింది. ఇరాన్‌లో పర్షియన్ గల్ఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొజ్తాబా

- మిగతా 2వ పేజీలో



## కోహినూర్ మనదే..

# తిరిగి ఇవ్వండి

మళ్లీ రగులుతున్న చర్చలు

భారత్‌కు తిరిగి ఇవ్వాలన్న డిమాండ్‌కు మద్దతు

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

చారిత్రక ప్రాధాన్యం కలిగిన 'కోహినూర్ వజ్రం' అంశం మరోసారి అంతర్జాతీయ వేదికపై చర్చనీయాంశంగా మారింది. న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ, తనకు అవకాశం లభిస్తే బ్రిటన్ రాజు చార్లెస్ III ను కలిసి కోహినూర్‌ను భారత్‌కు తిరిగి ఇవ్వాలని కోరతానని వెల్లడించారు. కోహినూర్ వజ్రం ప్రపంచంలో అత్యంత ప్రసిద్ధి చెందిన వజ్రాలలో ఒకటి. ఈ వజ్రం

- మిగతా 2వ పేజీలో



## జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులకు జూన్ 16 వరకు గడువు పొడిగింపు: హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ప్రజాతీర్పు)

తెలంగాణ హైకోర్టు జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 జూన్ 16 వరకు పొడిగించింది. G.O. Ms. No. 252 మరియు దాని సవరణ అయిన G.O. 103ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరుపుతూ కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సహా మరికొందరు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల చెల్లుబాటును ప్రశ్నిస్తూ, విచారణ కొనసాగుతున్నంత వరకు అక్రిడిటేషన్ సదుపాయాలను కొనసాగించాలని వారు కోరారు. పిటిషనర్ల తరపున అడ్వకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా స్పెషల్ అడ్వకేట్ జనరల్ ప్రభుత్వ అభిప్రాయాన్ని కోర్టుకు తెలియజేశారు. ప్రభుత్వం ఇప్పటికే ఒక నెలపాటు కార్డుల గడువు పొడిగించాలని నిర్ణయించిందని చెప్పారు. అయితే, అది సమ్మర్ సెలవులతో సరిపోతుందని గమనించిన కోర్టు, జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గడువును

- మిగతా 2వ పేజీలో



## విద్యార్థుల నుంచి

# ఫీడ్‌బ్యాక్ తీసుకోండి

### స్కూళ్లకు యూనిఫామ్, పుస్తకాలు, ఇతర సామగ్రి సరఫరాపై సీఎం రేవంత్

విద్యార్థులకు అవసరమైన సామగ్రి గడువులోగా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని సీఎం రేవంత్ ఆదేశించారు. అక్కడి నుంచి క్షేత్రస్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని.. సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలని అన్నారు.

- వస్తువులన్నీ నాణ్యమైనవే అయ్యుండాలి
- జూన్ 15లోగా స్కూళ్లకు పంపాలి
- విద్యా సామగ్రి కేంద్రీకృత సేకరణ విధానంపై ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్‌లు, స్కూల్ బ్యాగ్‌లు, ఐడీ కార్డులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి అంతా నాణ్యమైనవే అయ్యుండాలని.. అవన్నీ జూన్ 15లోగా స్కూళ్లకు అందేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు సామగ్రి అందాక వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని సూచించారు. విద్యాశాఖతోపాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ అభివృద్ధి శాఖ పరిధిలోని విద్యాసంస్థల్లోని విద్యార్థులకు అందించే సామగ్రి కేంద్రీకృత సేకరణ విధానంపై సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సమీక్షించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ సేకరణ, సరఫరా చేపట్టడంతో నాణ్యత లోపంతోపాటు అక్రమాలు జరిగేవని.. వాటిని అరికట్టేందుకే కేంద్రీకృత సేకరణ విధానాన్ని తెచ్చినట్లు తెలిపారు. ఈ విధానం వల్ల అధికారుల్లో జవాబుదారీతనం పెరుగుతుందని చెప్పారు. విద్యార్థులకు అవసరమైన సామగ్రి గడువులోగా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

**మండలానికో నోడల్ అధికారి...**

విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని సీఎం రేవంత్

- మిగతా 2వ పేజీలో



## కవితకు చిత్తశుద్ధి ఉందా?

పార్టీ పేరుపై క్లారిటీ కరువు

అయిదు రోజుల్లోనే పేరు మార్పు?

కవిత నిర్ణయాలపై సందేహాలు!

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్ )

తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసిన అంశం కల్వకుంట్ల కవిత ప్రకటించిన కొత్త పార్టీ పేరు మార్పు. భారీ సన్నాహాలు, ఖర్చుతో నిర్వహించిన

- మిగతా 2వ పేజీలో



## అర్హులందరికీ అక్రెడేషన్లు

### మంత్రి పొంగులేటి

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

దేశానికే ఆదర్శంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతీ జర్నలిస్టుకూ అక్రెడిటేషన్లు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గురువారం లిజర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులను మంత్రి అందజేశారు.లి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లిసీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు పాత్రికేయులకు ఆరోగ్యంతోపాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదనిలి చెప్పారు. గత ప్రభుత్వం ఇచ్చిన అక్రెడిటేషన్ కార్డులను ఇప్పటివరకు పొడిగించామని.. దేశంలో, ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఇక్కడ అనుసరించాలన్న ఆలోచన మేరకే కార్డుల జారీలో ఆలస్యం చోటు చేసుకుందన్నారు. లిగత ప్రభుత్వం 32,500 మందికి అక్రెడిటేషన్లు ఇచ్చే అవకాశం ఉన్నా 23,352కే పరిమితం చేసిందన్నారు. తమ ప్రభుత్వం ఇప్పుడు సుమారు 46 వేల మందికి పైగా ఇచ్చేలా మార్పులు చేసిందని వెల్లడించారు.లి లిఇప్పటికే సుమారు 2,800 వరకు కార్డులను ఆమోదించడం జరిగిందని

- మిగతా 2వ పేజీలో




## మే ఆఖరుకు డబుల్ ఇళ్ల కేటాయింపు

# పూర్తి చేయాలి

అనర్హులను తొలగించి.. అర్హులకు కేటాయించాలి

ఆ కాలనీల్లో రూ.400 కోట్లతో మౌలిక వసతుల కల్పన

ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులతో మంత్రి పొంగులేటి సమీక్ష

- 2లో





# మండుతున్న ఎండాకాలం

### వడదెబ్బతో అల్లాడుతున్న జనం.. మండుతున్న మొక్కజొన్న, వరి పంటలు

హైదరాబాద్, ఏప్రిల్ 30: గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. పదేళ్లలో కనీవినీ ఎరగనిరీతిలో ఎండల తీవ్రత ఈసారి ఉంది. భానుడి ఉగ్రరూపం దాల్చుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇప్పటికే చాలా జిల్లాల్లో.. కొన్ని రోజులుగా 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వడదెబ్బబారిన పడి ప్రజలు మృత్యువాత కూడా పడుతున్నారు. మరోవైపు ఎండల ప్రభావంతో జరుగుతున్న అగ్నిప్రమాదాల్లో మొక్కజొన్న, వరి, ఇతర పంటలు దగ్ధం అవుతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైతే, అడవులు కూడా తగలపడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ కారణం గా మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా

- మిగతా 2వ పేజీలో

# ఫీడ్‌బ్యాక్ తీసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. అక్కడి నుంచి క్షేత్రస్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని.. సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలని అన్నారు. ప్రతి విద్యార్థికి అవసరమైన సామగ్రి అందిందా లేదా అనే విషయాన్ని సరిచూసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, గురుకులాల కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులకు జూన్ 16 వరకు

(మొదటి పేజీ తరువాయి)

జూన్ 16 వరకు మరింతగా పొడిగించింది. కోర్టు స్పష్టంగా తెలిపింది. ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డులు అన్నీ 2026 జూన్ 16 వరకు చెల్లుబాటు అవుతాయని. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి కోర్టు సమయం ఇచ్చింది.

### జర్నలిస్టులకు తాత్కాలిక ఊరట

ఈ నిర్ణయం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అక్రిడిటెడ్ జర్నలిస్టులు అధికారిక కార్యక్రమాలకు అంతరాయం లేకుండా హాజరవుతారు. అలాగే అక్రిడిటేషన్‌కు సంబంధించిన అన్ని ప్రయోజనాలు కూడా కొనసాగుతాయి. దీంతో వారి వృత్తిపరమైన పనుల్లో ఎలాంటి ఆటంకం ఉండదు. ఇక ఫెడరేషన్ తరఫున ఒక ఇంటర్‌లోక్యూటరీ అప్లికేషన్ కూడా దాఖలు చేశారు. అందులో, వచ్చిన దరఖాస్తుల సంఖ్య, జారీ చేసిన కార్డులు, తిరస్కరించిన దరఖాస్తులు మరియు వాటి కారణాల వివరాలను కోర్టు ముందు ఉంచాలని కోరారు. ఈ అంశాన్ని తదుపరి విచారణలో కోర్టు పరిశీలించనుంది. ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ సయ్యద్ ఘౌస్ మొహియుద్దీన్ ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. అయితే, ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని పేర్కొన్నారు. శాశ్వత పరిష్కారం కోసం తమ న్యాయ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కోర్టు తదుపరి విచారణను జూన్ 16, 2026కు వాయిదా వేసింది. ఆ విచారణలో ఈ ప్రభుత్వ ఆదేశాల భవిష్యత్తుపై తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ పరిణామం రాష్ట్రంలోని మీడియా వర్గాలకు ముఖ్యమైనదిగా భావిస్తున్నారు. ఇది వారి పనిలో స్థిరత్వాన్ని కల్పించడంతో పాటు, అక్రిడిటేషన్ విధానాలపై కొనసాగుతున్న ఆందోళనలను కూడా వెలుగులోకి తెచ్చింది.

# కోహినూర్ మనదే..తిరిగి ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

మొదట భారతదేశంలోనే లభించిందని చరిత్ర చెబుతోంది. ముఖ్యంగా గోల్కొండ గనుల నుంచి వెలికితీసిన ఈ వజ్రం అనేక రాజవంశాల చేతుల్లో మారుతూ చివరకు బ్రిటిష్ వారి అధీనంలోకి వెళ్లింది. 19వ శతాబ్దంలో ఆంగ్లో–సిక్కు యుద్ధాలు అనంతరం ఈ వజ్రాన్ని బ్రిటన్‌కు తరలించారు. ప్రస్తుతం ఈ కోహినూర్ వజ్రం లండన్‌లోని టవర్ ఆఫ్ లండన్ లో భద్రపరిచి ఉంచారు. ఇది బ్రిటిష్ కిరీట ఆభరణాలలో భాగంగా ఉంది. భారత్ సహా పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ వంటి దేశాలు కూడా ఈ వజ్రంపై తమ హక్కును వినిపిస్తున్నాయి. భారత్ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కోహినూర్‌ను తిరిగి ఇవ్వాలని అనేకసార్లు డిమాండ్లు వచ్చాయి. కానీ బ్రిటన్ ప్రభుత్వం మాత్రం ఇది చట్టబద్ధంగానే తమకు వచ్చినదని పేర్కొంటూ తిరిగి ఇవ్వడంపై స్పష్టత ఇవ్వలేదు. ఇలాంటి సమయంలో మమ్దానీ చేసిన వ్యాఖ్యలు మరోసారి ఈ చర్చకు ఊపిరి పోశాయి. అంతర్జాతీయంగా కాలనీయ దోపిడీపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో, కోహినూర్ అంశం మళ్లీ ప్రధానంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అర్హులందరికీ అక్రెడేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. జర్నలిస్టుల సూచనల మేరకు జీవోలలో మార్పులు చేర్పులు చేశామని.. అర్హులైన వారికి కార్డులు మంజూరు చేయడంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. అలాగే.. లినేటి నుంచి జిల్లాల్లో కార్డులు పంపిణీ చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామనిలి మంత్రి చెప్పారు. ఈ ప్రక్రియను లిమే 10వ తేదీని ఒక కటాఫ్ డేట్‌గా పెట్టుకొని దరఖాస్తులు చేసుకోవాలని.. ఆ తేదీలోగా వచ్చే దరఖాస్తులను ఆమోదించడం జరుగుతుందనిలి మంత్రి తెలిపారు. లిరాష్ట్రంలో అక్రెడిటేషన్ల సంఖ్య తేలితే జర్నలిస్టులకు ఆరోగ్యం ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఒక ప్రణాళిక రూపొందించుకోవచ్చుననిలి తెలిపారు. అలాగే.. లిజర్నలిస్టులు ఉద్యోగాలు మారినప్పుడూ అక్రెడిటేషన్లను తమ సంస్థ పేరు మీదకు మార్చుకోవచ్చన్నారు.లి త్వరలో పాత్రికేయ సంఘాలతో భేటీ అవుతామని తెలిపారు. లిఏప్రిల్ 30తో కొంతమంది జర్నలిస్టుల బస్సుపాస్‌ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో మరో 15 రోజులపాటు పొడిగించేలా చర్యలు తీసుకుంటామనిలి మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లిమీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుందరెడ్డి, టియుడబ్ల్యూజే(ఐజేయు) రాష్ట్రఅధ్యక్షులు విరాహత్ అలీలి తదితరులు పాల్గొన్నారు.

# కవితకు చిత్తశుద్ధి ఉందా?

(మొదటి పేజీ తరువాయి)



సభలో ఏప్రిల్ 25న "తెలంగాణ రాష్ట్ర సేన" పేరును ప్రకటించిన కవిత, కేవలం అయిదు రోజుల్లోనే ఆ పేరును మార్చాల్సి వచ్చిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల కమీషన్ నుంచి వచ్చిన తాజా సమాచారంతో ఈ పరిణామం వెలుగులోకి వచ్చింది. కవితకు పంపిన లేఖలో "తెలంగాణ రక్షణ సేన" అనే పేరుతో పబ్లిక్ నోటీస్ ఇవ్వవచ్చని మాత్రమే సూచించబడింది. అయితే ఇది పార్టీ పేరుకు తుది అనుమతి కాదని స్పష్టంగా పేర్కొన్నారు. ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన తర్వాతే ఆ పేరును రిజిస్టర్ చేసే ప్రక్రియ పూర్తవుతుంది. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఎన్నికల కమీషన్ లేఖ ప్రకారం కవిత ఏప్రిల్ 23న ఐదు పేర్లను సూచించగా, వాటిలో "తెలంగాణ రాష్ట్ర సేన" పేరు లేకపోవడం. కానీ రెండు రోజుల తరువాత అదే పేరును సభలో ప్రకటించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అంతేకాదు, కమీషన్ లేఖపై తేదీ లేకపోవడం కూడా సందేహాలను పెంచుతోంది. నిజంగా ఏప్రిల్ 23న ఈ అభ్యర్థన పంపించారా? లేదా తరువాత జరిగిన పరిణామాల ఫలితమా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి. పార్టీ ప్రారంభంలోనే పేరు మార్పు వంటి నిర్ణయాలు తీసుకోవడం కవిత నాయకత్వంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. సోషల్ మీడియాలో కూడా నెటిజన్లు ఈ అంశంపై విమర్శలు, సెటైర్లు చేస్తున్నారు. "ఇంత త్వరగా మార్పు ఎందుకు?" "పార్టీ నిర్ణయాల్లో స్థిరత్వం లేదా?" అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తానికి, పార్టీ పేరుపై స్పష్టత రాకపోవడం, నిర్ణయాల్లో మార్పులు చోటుచేసుకోవడం కవిత కొత్త రాజకీయ ప్రయాణానికి ప్రారంభంలోనే సవాళ్లను సృష్టిస్తున్నాయి.

# మే ఆఖరుకు డబుల్ ఇళ్ల కేటాయింపు పూర్తి చేయాలి

## ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులతో మంత్రి పొంగులేటి సమీక్ష

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నా మే నెల చివరికి లబ్ధిదారులను గుర్తించి కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి ఇంతవరకు ఖర్చు చేసిన మొత్తాన్ని మినహాయించి, తదుపరి అవసరమైన వ్యయాన్ని రూ.ఐదు లక్షలలోపు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అందచేస్తామని వెల్ల డించారు. అసంపూర్తిగా ఉన్న 2 బీహెచ్‌కే ఇళ్లను పూర్తి చేయడా నికి కాంట్రాక్టర్లు ముందుకు రాని పక్షంలో లబ్ధిదారులే నిర్మించుకునేలా నిర్ణయించినట్టు తెలిపారు. ఈ ఇళ్ల నిర్మాణాలకు గ్రీన్‌చానల్‌లో నిధులు విడుదల చేస్తామని తెలిపారు. గురువారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, డి. శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హెచ్.వేణుగోపాల్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, హౌసింగ్ కార్యదర్శి వీపీ గౌతం, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్ రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో ఆయా అంశాలపై సమీక్షించారు. చాలా ఇళ్లలో అనర్హులు ఉన్నారని, వారిని తొలగించి అర్హులకు ఇవ్వాలని పలువురు ఎమ్మెల్యేలు మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే అనర్హులను తొలగించే చర్యలు చేపట్టాలని, అర్హులకు కేటాయించాలని, ఇందులో ఎమ్మెల్యేలను భాగస్వాములను చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీల్లో రూ.400 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు.

### భూముల పరిరక్షణలో రాజీపడం

ప్రభుత్వ భూముల ఆక్రమణల కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను మంత్రి పొంగులేటి ఆదేశించారు. రెవెన్యూ, ఫారెస్టు భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారానికి రెవెన్యూ, ఫారెస్టు విభాగాలు జాయింట్ సర్వేకు ఆదేశించారు. కొత్తగా రెవెన్యూ డివిజన్లు, మండలాలను ఏర్పాటు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో 30 కేవీ ఉత్పాదన సామర్థ్యంతో నెలకొల్పిన సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ ప్లాంట్‌ను పొంగులేటి ప్రారంభించారు.

### నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం : మంత్రి శ్రీధర్‌బాబు

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో గృహ నిర్మాణ లక్ష్యాలను చేరుకోలేని అధికారులను ఉపేక్షించేది లేదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హెచ్చరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఏటా 3,500 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని శ్రీధర్‌బాబు సూచించారు.

# మండుతున్న ఎండాకాలం

(మొదటి పేజీ తరువాయి)

అందించాలనే ఉత్తర్వులూ ఉన్నాయి. సాధారణంగా ఏప్రిల్ నెల అనగానే ఉష్ణోగ్రతలు ఎక్కువగానే ఉంటుంది. కానీ ఈ ఏడాది ఏప్రిల్‌లో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు చూస్తుంటే ఆందోళన కలుగుతున్నది. ఉదయం 10 దాటిందంటే వేడి తీవ్రత పెరుగుతోంది. దీంతో జనం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల కింద కూర్చుంటున్న పరిస్థితి నెలకొంది. మే నెల రాకముందు నుంచే గత వారం పది రోజుల నుంచి అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పలు జిల్లాల్లో అప్పుడే 46 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతూ భయపడేలా చేస్తున్నారు. నిజానికి, ఈ స్థాయి ఎండలు రోహిణీ కార్తె' సమయంలో, అంటే మే 25వ తేదీ తర్వాత ఉంటాయి. ఒక నెల ముందుగానే ఆ స్థాయిలో ఎండలతో రాష్ట్రంలో మండిపోతున్నాయి. ఇది ప్రపంచ వాతావరణాన్ని అతలాకుతలం చేయబోతున్న సూపర్ ఎల్‌నినో ప్రభా వమని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. అయితే దీని ప్రభావం దక్షిణ భారతంపై కాస్త తక్కువగానే ఉన్నా మధ్యభారతంపై ఈసారి ఎక్కువగా ఉందని వారు పేర్కొంటున్నారు. గురువారం రాష్ట్రంలోని జగిత్యాల్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు హీట్ వేవ్ హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసింది. అంటే ఈ ప్రాంతాల్లో 45.0 డిగ్రీల కంటే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 47 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుకుంటే తీవ్రమైన వడగాలులు వీచే ప్రమా దం ఉంది. ఇక పెద్ద పల్లి జిల్లా రామగుండంలో అత్యధికకంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైతే, నల్లగొండ జిల్లా మునుగోడులో 45.8 డిగ్రీలు, జగిత్యాల్ జిల్లా ధర్మపురిలో 45.4 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా బేలాలో 45.3 డిగ్రీలు, నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో 45.3 డిగ్రీలు, కరీంనగర్ జిల్లా చొప్పదండిలో 45.2 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా కోహెడాలో 45.2 డిగ్రీల చొప్పు అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన 22 జిల్లాల్లో 42.4 డిగ్రీల నుంచి 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ్వడం గమనార్హం. మరో రెండు రోజులు రా ష్ట్రంలో ఎండల తీవ్ర ఉండనుంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను వాతావరణ శాఖ జారీ చేసింది.



### వడదెబ్బ బారినపడుతున్న జనం..

ఎండల తీవ్రతతో జనం వడదెబ్బ బారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎక్కువగా వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ఏప్రిల్ 9న ముగ్గురు, 15న వడదెబ్బ కారణంగా మహబూబాబాద్ జిల్లాలో నలుగురు, 23న రాష్ట్రంలో ఏడుగురు, 26న ఆరుగురు, 27న ముగ్గురు వడదెబ్బతో మృత్యువాత పడ్డారు.

### పంటలపై ప్రభావం..

అధిక ఉష్ణోగ్రతల వల్ల పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఏప్రిల్‌లో వచ్చే తీవ్రమైన వేడి గాలులు పంటలను నాశనం చేస్తాయి. వరి పొట్టకొచ్చే దశ లో (ఫ్లోవరింగ్ స్టేజ్) అధిక ఉష్ణోగ్రతలకు గురైతే గింజ గట్టిపడక నిలువునా ఎండిపోతుంది. మొక్కజొ న్న... వేడి గాలులు, అధిక ఉష్ణోగ్రతల వల్ల మొక్క జొన్న ఎదుగుదల ఆగిపోయి దిగుబడి తగ్గుతుంది. పప్పుధాన్యాలైతే మినుము, పెసర, సోయాచిక్కుడు వంటి పం టలు తీవ్రమైన వేడిని తట్టుకోలేక ఎండిపోతా యి. దీంతో గింజల నాణ్యత దెబ్బతింటుందని నిపుణులు చెప్తున్నారు. అధికవేడి వల్ల పత్తి కాయలు సరిగ్గా పరిపక్వం చెందవు. కొన్నిసార్లయితే రాలిపోతాయి.

### నాలుగు లక్షల పరిహారం..

ఎండల తీవ్రతకు ప్రజలు ప్రాణాలు కో ల్పోతే వారి కుంటుంబాలకు ప్రభుత్వం ఆదుకుంటుంది. వడదెబ్బ కారణంగా మృతి చెందితే ప్రభుత్వం పరిహారం అందిస్తుంది. దీనిని ఇటీవల రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకు పెంచింది. మండల స్థాయిలోని రెవెన్యూ, పోలీసు, వైద్య శాఖల అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ వడదెబ్బ మరణాలను నిర్ధారిస్తుంది. కాగా, వడదెబ్బ కారణంగా మృ తి చెందిన మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అంది స్తోంది. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ ద్వారా రూ.4 లక్షల వరకు మృతుల కుటుంబాలకు అందుతాయి. అయితే ఈ పరిహారం పొందడానికి పోస్టుమార్టం రిపోర్టు, ఎఫ్ఐఆర్, వాతావరణ శాఖ ధ్రువీకరణ వంటి నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.

### పరిహారం కోసం కావల్సిన పత్రాలు

ప్రభుత్వ ఆసుపత్రిలో ఇచ్చిన మృతుడి పోస్టుమార్టం రిపోర్టు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఎఫ్ఐఆర్, ఫైనల్ రిపోర్టు. స్థానిక రెవెన్యూ అధికారులు ఇచ్చిన డెత్ సర్టిఫికేట్

మృతుడి, వారసుల ఆధార్‌కార్డు జిరాక్స్. పరిహారం జమ చేసేందుకు బ్యాంకు పాస్‌బుక్ వివరాలు. మృతుని కుటుంబ సభ్యుల డిక్లరేషన్. కలెక్టర్ ఆమోదం పొందిన వెంటనే నామినీ బ్యాంకు ఖాతాలో జమచేస్తారు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల మధ్య వీలైనంత వరకు ఎండనుంచి దూరంగా ఉండటం మంచిది. నీళ్లు, లేదా జ్యూసులు లాంటివి ఎక్కువగా తీసుకోవాలి. శరీర ఉష్ణోగ్రత ఒక్కసారిగా 104 డిగ్రీల ఫారెన్‌హీట్ (40 డిగ్రీలకు చేరితే) వడదెబ్బ సోకినట్లుగా గుర్తించి వెంటనే హాస్పిటల్‌కు తరలించాలి.

పరిశ్రమలు, సంస్థల్లో పని చేసే కార్మికులకు రొటేషన్ పద్ధతిని అమలుచేయాలి.

పట్టణ ప్రాంతాల్లో కూల్ వార్డులు ఏర్పాటు చేసి, వడ దెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

కార్మికులు మధ్యాహ్నం గంట లేదా రెండు గంటల పాటు నీడపట్టున విశ్రాంతి తీసుకోవడం ముఖ్యం.

ఎండలో తప్పనిసరిగా బయటికి వెళ్లాలంటే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు ధరించండి.

తెల్లని నూలు వస్త్రాలు ధరించడం ఉత్తమం.

కూల్ డ్రింక్స్, మత్తు పానీయాల జోలికి వెళ్లకూడదు.

నీరు, ఇతర ద్రవపదార్థాలు ఎక్కువ తీసుకోవాలి.

వడదెబ్బ సోకిన వారికి 15 నిమిషాలకు ఒకసారి కోల్డ్ స్పాంజింగ్ చేయాలి. చికిత్స చేయించాలి.

### ఏటా 5.45 లక్షల మంది మృతి..

ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ వాతావరణ సంస్థ అధ్యయనం ప్రకా రం ఆరుబయట పనులు చేసే 160 కోట్ల మందికి అధిక వేడి ముప్పుఎక్కువగా ఉంది. భారత్ సహా 77 దేశా ల్లోని 100 కోట్ల మందికి ఈ ముప్పు మరీ ఎక్కువగా ఉంది. అత్యధిక హీట్ వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 5,45, 000 మంది చనిపోతున్నారని 'సస్టెయినబుల్ ఎనర్జీ ఫర్‌ఆల్' అనే సంస్థ గణాంకాలు చెబుతున్నాయి.

## పనిభారం పెరిగిందని సమ్మె..

# సమ్మె తర్వాత మరింత పని

### ఆర్టీసీలో విచిత్ర పరిస్థితి

- కొత్త వేతన సవరణతో పెరిగిన జీతాలు
- రోజుకు రూ.2 కోట్ల ఆదాయం పెంచాలంటూ డిపోలకు ఆదేశాలు

హైదరాబాద్: వేతన సవరణ చేయాలన్నది సాధారణంగా ఉద్యోగుల ప్రధాన డిమాండ్‌గా ఉంటుంది. కానీ, ఇటీవల ఆర్టీసీ సమ్మె సమయంలో వేతన సవరణ కంటే కార్మికుల నుంచి ప్రధానంగా వినిపించిన డిమాండ్ 'ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి'అన్నదే. ప్రభుత్వంలో విలీనం అయితే పనిఒత్తిడి నుంచి కొంత ఊరట లభిస్తుందన్న ఆశతో అదే ప్రధాన డిమాండ్‌గా సమ్మెకు దిగారు. అయితే సమ్మె ముగిసిన తర్వాత వెంటనే మరింత పనిఒత్తిడి ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం రోజువారీ టికెట్ ఆదాయాన్ని కనీసం రూ.2 కోట్ల మేర పెంచాలంటూ ఆర్టీసీ ఉన్నతాధికారుల నుంచి డిపోలకు మౌఖిక ఆదేశాలందాయి. ఇటీవలి సమ్మె నేపథ్యంలో, ఆర్టీసీ ఉద్యోగులకు బకాయి ఉన్న 2021 వేతన సవరణ చేస్తామంటూ ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీని వల్ల సంస్థపై రూ.35 కోట్ల వరకు నెలవారీ భారం నమోదు కానుంది. రోజువారీ ఆదాయం--రోజువారీ ఖర్చులను పరిశీలిస్తే రోజుకు రూ.2 కోట్ల లోటు నమోదవుతోందని అధికారులు లెక్కలేశారు. నెలకు ఆర్టీసీకి వస్తున్న ఆదాయం రూ.630 కోట్లు కాగా, ఖర్చు రూ.655 కోట్లుగా ఉందని ఇటీవల డిపోలకు సమాచారం అందించారు. అంటే ఇప్పటికే నెలకు రూ.25 కోట్ల లోటు ఉండగా, వేతన సవరణతో కొత్తగా రూ.35 కోట్ల భారం పెరుగుతోంది. వెరసి రూ.60 కోట్ల లోటు పెరగనుంది. దీంతో రోజువారీ ఆదాయాన్ని రూ.10 కోట్ల నుంచి రూ.12 కోట్లకు పెంచాలంటూ కిందిస్థాయి అధికారులకు మౌఖిక ఆదేశాలు అందాయి. దీంతో మళ్లీ కార్మీకులపై ఒత్తిడి పెరగబోతోంది.

### సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించండి!

'2018లో కొండగట్టు వద్ద 65 మంది ప్రాణాలు బలిగొన్న బస్సు ప్రమాదానికి డ్రైవర్ తప్పిదంతోపాటు సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఉండటం కూడా ఓ కారణమని విచారణలో తేలింది. బస్సుల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్న సిఫారసులు జారీ అయ్యాయి'

ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో సగటు ఆక్యుపెన్సీ రేషియో వంద నమోదవుతోంది. చాలా రూట్లలో అది 110 శాతాన్ని కూడా మించుతోంది. దీంతో తదుపరి నెలల్లో ఆక్యుపెన్సీ రేషియో అంతకుమించి ఉండాలని స్వయంగా ఆర్టీసీ ఉన్నతాధికారులు డిపోలకు లక్ష్యం నిర్ధారిస్తున్నారు. అంటే, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోమని నేరుగానే చెబుతున్నారన్నమాట. వంద శాతాన్ని మించి ఓఆర్ నమోదైనా... అది టార్గెట్ కంటే తక్కువ ఉంటే డిపో మేనేజర్లను ప్రశ్నిస్తున్నారు. కొందరు మెమోలు జారీ అవుతున్నాయని తెలిసింది. దీంతో డిపో మేనేజర్లు కార్మీకులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఇది కొన్నేళ్లుగా జరుగుతున్న పరిణామం.

2019లో రికార్డుస్థాయిలో 52 రోజుల పాటు సమ్మె చేసినప్పుడు, విధుల్లోకి రాని ఉద్యోగులు, కార్మీకులను తొలగిస్తామని, వారి స్థానంలో ప్రైవేట్ సిబ్బందిని తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించటంతో అప్పట్లో సమ్మె ఆగిపోయింది. ఆ తర్వాత సమ్మె అంటేనే కార్మికులు భయాందోళనకు గురయ్యారు. అలాంటిది పని ఒత్తిడిని తట్టుకోలేక మళ్లీ తెగువతో సమ్మెకు దిగారు.

### ప్రశ్నించలేక.. కార్మీకులపై డీఎంల ఒత్తిడి

ప్రస్తుతం ఆర్టీసీలో దాదాపు డిపో మేనేజర్లు అంతా పదోన్నతుల ద్వారా వచ్చిన వారే, డైరెక్ట్ రిక్రూటీస్ లేరు. పదోన్నతుల ద్వారా డీఎంలు అయిన వారు డిపో ఇబ్బందులు, ఉన్నతాధికారులు ఇచ్చే ఆదేశాల అమలు సమస్యల మీద ఉన్నతాధికారులను ప్రశ్నించలేకపోతున్నారు. దీంతో ఆదేశాలను అమలు చేయాల్సి రావటంతో నేరుగా కార్మీకులపై ఒత్తిడి పెంచాల్సి వస్తోంది. తాజాగా రూ.2 కోట్ల అదనపు ఆదాయం విషయంలో కార్మీకులకు ప్రత్యేక సూచనలు జారీ చేస్తుంటే, 'సమ్మె చేసినా మాపై ఒత్తిడి తగ్గించరా'అంటూ కార్మీకులు డిపో మేనేజర్లను ప్రశ్నిస్తున్నారు. దీంతో అటు ఉన్నతాధికారులకు చెప్పలేక, ఇటు కార్మీకులతో పని చేయించలేక డిపో మేనేజర్లు సతమతమవుతున్నారు.



# సముద్రంలో ముంచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఖమేనీ రాతపూర్వక సందేశం విడుదల చేశారు. "దేశం లోపల, వెలుపల ఉన్న 9 కోట్ల మంది ఇరానియన్లు.. నానోటెక్నాలజీ, బయోటెక్నాలజీ నుంచి అణు, క్షిపణి సామర్థ్యాల వరకు ఇరాన్ గుర్తింపు–ఆధారిత, ఆధ్యాత్మిక, మానవ, శాస్త్రీయ, పారిశ్రామిక, సాంకేతిక సామర్థ్యాలన్నింటినీ జాతీయ ఆస్తులుగా భావిస్తారు. వారు దేశ జలాలు, భూమి, గగనతలాన్ని ఎలాగైతే కాపాడుకుంటారో.. ఈ సామర్థ్యాలనూ అలాగే రక్షించుకుంటారు" అని అందులో పేర్కొన్నారు. "దేవుడి దయవల్ల పర్షియన్ గల్ఫ్ ఉజ్వల భవిష్యత్తులో అమెరికా ప్రమేయం ఉండదు. హర్మూజ్ కోసం చట్టబద్ధమైన కొత్త నిబంధనలను మేం తీసుకువస్తాం. అవి గల్ఫ్ దేశాలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తాయి. ప్రాంతీయంగా శాంతిని నెలకొల్పుతాయి. హర్మూజ్, గల్ఫ్ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలవుతోంది" అని కూడా మొజ్తాబా తెలిపారు. అమెరికాను 'పెద్ద సైతాను'గా మొజ్తాబా అభివర్ణించారు. పర్షియన్ గల్ఫ్‌లో అమెరికన్లకు పనేంటని ప్రశ్నించారు. "అత్యాశ, దుర్బుద్ధితో వేల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే విదేశీయులకు.. పర్షియన్ గల్ఫ్‌లో నీటి అడుగున తప్ప మరెక్కడా స్థానం ఉండదు. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలు వాటినవే కాపాడుకోలేకపోతున్నాయి. అలాంటప్పుడు తమపై ఆధారపడిన దేశాల భద్రతకు అవి ఎలా హామీ ఇవ్వగలవు" అని ఆయన ప్రశ్నించారు. హర్మూజ్‌లో శత్రువుల దురాగతాలను ఇరాన్ నిర్మూలిస్తుందన్నారు.

## పది ఫలితాల్లో ఓటమిని చూసి విద్యార్థులు తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దు

● స్వచ్ఛంద సంస్థ నిర్వాహరాలు ప్రేమ కుమారి

**భద్రాద్రి కొత్తగూడెం రూరల్, ఏప్రిల్ 29 (ప్రజా తీర్పు )**



రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి ఫలితాలు విడుదలైన నేపథ్యంలో కొయ్యలగూడెం ఎల్ ఎస్ ఎం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకరాలు ప్రేమ కుమారి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. జీవితంలో జయాపజయాలు సహజమని పేర్కొన్నారు.?ఉత్తీర్ణులు కాని విద్యార్థులు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. గెలిచినా, ఓడినా ఎవరూ నిరాశ చెందకూడదని, భవిష్యత్తులో ఇంకా ఎన్నో అవకాశాలు వస్తాయన్నారు. విద్యార్థులు భావోద్వేగాలకు లోనై తప్పుడు నిర్ణయాలు తీసుకోకూడదని, జీవితం ఎంతో విలువైనదని ప్రేమ కుమారి పేర్కొన్నారు.

## తెలంగాణ మైనార్టీ స్కూల్లో అత్యధిక మార్కులు సాధించిన మేఘన

**(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు మంచిర్యాల మండల్ ) ఏప్రిల్30**



మంచిర్యాల మండల్ శ్రీరాంపూర్ కాలనీకి చెందిన కుమ్మరి సతీష్, ప్రేమలత ప్రథమ పుత్రిక కుమ్మరి మేఘనా మాధురి పెద్దపల్లి తెలంగాణ మైనార్టీ స్కూల్లో (2025-26) సంవత్సరానికి గాను అత్యధిక మార్కులు 570 మార్కులతో టాపర్ గా నిలిచింది ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు మేఘన పట్టుదల కృషిని ఎంతగానో అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. తన విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం మరియు ఉపాధ్యాయుల సూచనల మేరకు ఈ విజయం సాధించానని మేఘన అన్నారు.

## సాయినాథ్ కు ఎల్వోసి అందజేసిన ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) ఏప్రిల్ 30**

నిర్మల్ జిల్లా భైంసా మండలం దేగాం గ్రామానికీ ద్యావరి రాజకళా సాయినాథ్ గారి ఆరోగ్య సహాయార్థం మంజూరైన ?2,00,000/- రెండు లక్షల రూపాయల విలువ గల ఎల్వోసి లేటర్ ఆఫ్ క్రెడిట్ చెక్కును గౌరవనీయులైన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గారు తన చేతుల మీదుగా సర్పంచ్ సుష్మా రెడ్డి గారుఅందజేశారు.ఈకార్యక్రమంలో,వార్డ్ మెంబర్ పాతర్ల నరేష్ ముదిరాజ్,మరియు పోల్కమ్ సాయినాథ్ పాల్గొని లబ్ధిదారునికి భరోసా కల్పించారు.నిరుపేదలకు అండగా ఉంటూ వైద్యం కోసం ప్రభుత్వం నుండి ఈ సహాయాన్ని అందించడంలో చొరవ చూపిన నాయకులకు లబ్ధిదారులు మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.



## ఉత్తమ విద్యార్థులకు అభినందన...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఏప్రిల్ 30.**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లక్ష్మీపూర్ ఎస్ ఎస్ సి 2025-26 విద్యా సంవత్సరంలో ఉత్తమ ఉత్తీర్ణత సాధించి 500 ల మార్కులకు పైన మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులు. 565 మార్కులతో టాపర్ గా నిలిచిన నక్క అంజలి 553 మార్కులతో నేరెల్ల రోహిత్ తో పాటు 12 గురు విద్యార్థులను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దెల సరోజన గ్రామ సర్పంచ్ నల్ల కవితస్వామిరెడ్డి ఉప సర్పంచ్ ఎడమల సత్యరెడ్డి ఆదర్శ పాఠశాల చైర్మెన్ సత్తెవ్వ డి.విజయ ఎ.సుజాతలు శాలువలతో సత్కరించి అభినందించారు.

## మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) ఏప్రిల్ 30:**



రబీ సీజన్ లో మొక్కజొన్న పంట సాగు చేసి, మక్కల విక్రయంలో తీవ్ర ఇబ్బం దులకు గురవుతున్న ఎండపల్లి మండల రైతులను ఆదుకోవాలని భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కు వినతి పత్రం అందించారు. వ్యవసాయ మార్కెట్ నిబంధనల వల్ల రైతులు మక్కలను దళారులకు విక్రయించాల్సిన పరిస్థితి దాపురించిందని, మార్క్ ఫెడ్ ధర మక్కలకు రూ. 2400 క్వింటాల్ కు ఉండగా రైతులు 1700కే దళారుల కు అమ్ముకుంటున్నారని, ఎండపల్లి మండలానికి కూతవేటు దూరంలో ఉన్న ధర్మారం వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఎండపల్లి మండల రైతుల మక్కలు కొనుగోలు చేసే విధంగా ఉన్నతాధికారులతో మాట్లాడి తగు చర్యలు చేపట్టి రైతులకు న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రావు హనుమంతరావు, బీజేవైఎం జిల్లా నాయకులు తిరుమల ప్రమోద్ గౌడ్, వెనేంక మహేందర్, సబ్బు సంతోష్, ఏలేటి భాస్కర్ రెడ్డి, దుర్గం రమేష్, దాసరి మల్లేష్, మామిడిపల్లి రమేష్, బోగ సురేష్, పర్వతి మధు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు కేటాయించాలి

● అధ్యక్ష కార్యదర్శులు కొండూరు రవీందర్,వెంక గారి భూమయ్య

**(?కపిల్ వాగ్మారే సి ఆర్ కే, ప్రజా తీర్పు భైంసా) ఏప్రిల్ 30**



నిర్మల్ జిల్లాలోని అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డుల మంజూరు విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీ యూ డబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షులుదూరు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంక గారి భూమయ్య డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలిచి, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో ఎంతో కష్టపడి పనిచేస్తున్న జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు (అక్రిడేషన్లు) ఇవ్వడంలో జాప్యం చేయడం తగదన్నారు. అలాగే, సొంత ఇల్లు లేక ఆర్థిక ఇబ్బందులతో అద్దె ఇళ్లలో నివసిస్తున్న జర్నలిస్టుల కుటుంబాల కోసం ప్రత్యేకంగా ఇళ్ల స్థలాలు కేటాయించి, వారి సొంతింటి కల సాకారం చేయాలని కోరారు.?ముఖ్యంగా విద్యా రంగంలో పెరుగుతున్న భారాన్ని దృష్టిలో ఉంచుకుని, జర్నలిస్టుల పిల్లలు చదువుకునే ప్రైవేట్ పాఠశాలల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించేలా జిల్లా యంత్రాంగం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ గారు తమ విన్నపాలను సానుకూలంగా పరిశీలించి, జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తారని ఆశిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పూసల పోశెట్టి, గుమ్ముల అశోక్, జల్ద మనోజ్, కార్యదర్శులు సట్ల హనుమాన్లు, రాజేశ్వర్,డిఎస్ మధు, వరప్రసాద్, బ్రహ్మయ్య, గంగారం, కల్చర్ల మరియు యూనియన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బోడుప్పల్ పదో తరగతి ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ఘన విజయం.



● పి. ప్రియదర్శిని ఫస్ట్ ర్యాంక్. ● కె. అక్షిత సెకండ్ ర్యాంక్.
● పి.వివేక శ్రీ థర్డ్ ర్యాంక్.

**బోడుప్పల్, ఏప్రిల్ 30 (ప్రజాతీర్పు)**

మేడ్చల్ మల్కాజ్గిరి బోడుప్పల్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఈ ఏడాది మరోసారి పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ఘన విజయం సాధించారు. పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధిస్తూ ప్రభంజనం సృష్టించారు. ఈ ఫలితాల్లో విద్యార్థిని పి. ప్రియదర్శిని 589 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ఆమె ప్రతిభ అందరికీ ఆదర్శంగా నిలిచింది. రెండో స్థానంలో కె. అక్షిత 582 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకుంది. మూడో స్థానంలో పి. వివేక శ్రీ 581 మార్కులు సాధించి మెరుగైన ఫలితాన్ని నమోదు చేసింది. ఇవి మాత్రమే కాకుండా, మొత్తం 49 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చారు. ముగ్గురు విద్యార్థులు 580కి పైగా మార్కులు సాధించగా, మరికొంతమంది 570, 560, 550 మార్కుల శ్రేణిలో అద్భుత ఫలితాలు నమోదు చేశారు. అనేక మంది విద్యార్థులు అత్యుత్తమ శ్రేణిలో నిలవడం పాఠశాల విద్యా ప్రమాణాలను ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా, మా పాఠశాలలో మొత్తం 87 మంది విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. ప్రతి విద్యార్థి విజయాన్ని అందుకోవడం ద్వారా పాఠశాల మరోసారి తన విద్యా నాణ్యతను నిరూపించింది. ఇది విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం కలయికగా సాధ్యమైందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా ఏజీఎం వీర రహ్మాన్, అకాడమీ కోఆర్డినేటర్ టి. రమేష్, పాఠశాల ప్రిన్సిపల్ ఏ. రాజేందర్, అకాడమిక్ డీన్ ఆర్. దీపక్, సీ ఇన్‌చార్జ్ నరేష్ మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలు వారి భవిష్యత్తుకు బలమైన పునాది అవుతాయని, ఇలాగే మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఈ విజయంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, పాఠశాల అందిస్తున్న నాణ్యమైన విద్యకు కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం మీద, బోడుప్పల్ తెలంగాణ శ్రీ చైతన్య పాఠశాల మరోసారి తన ప్రతిభను చాటుతూ విద్యా రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది.



## శ్రీ మహాదేవ సెల్ పాయింట్ ను ప్రారంభించిన నిర్మల్ జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు

**ఖానాపూర్ ఏప్రిల్ 30(ప్రజా తీర్పు ప్రతినిధి)**

నిర్మల్ జిల్లా లోని ఖానాపూర్ పట్టణంలోని గోలి కాంప్లెక్స్లో ఈరోజు నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మహాదేవ సెల్ పాయింట్ ను ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలియజేసిన నిర్మల్ జిల్లా డిసీసీ ఉపాధ్యక్షులు ఖానాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ 11వ వార్డు కౌన్సిలర్ రాజుర సత్యం. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఉద్యోగాలు చదువుతోపాటు వ్యాపార మరియు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. అనంతరం డిసిసి ఉపాధ్యక్షులు శాలువాతో ఘనంగా సన్మానించిన మొబైల్ షాప్ యజమానులు. ఈ కార్యక్రమంలో తర్లపాట్ సర్పంచ్ సచిన్ మరియు ఉప సర్పంచ్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



## యూరియా ను తక్కువ మోతాదులో వినియోగించాలి

● రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి
● పొలాస వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) ఏప్రిల్ 30:**

రైతులు తమ పొలాల్లో యూరియాను తక్కువ మోతాదులో వినియోగించాలని, వ్యవసాయ సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని పొలాస వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం లో భాగంగా జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గొడిశెలపేట క్లస్టర్ రైతువేదిక వద్ద సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా.స్పందన బట్ మాట్లాడుతూ తక్కువ యూరియా వాడకం, పంటల మార్పిడి, ప్రకృతి వ్యవసాయం, పచ్చిరొట్ట పంటల సాగు,నేల ఆరోగ్యం ,అలాగే వరి పంట కోసిన తర్వాత పంట అవశేషాలు కాల్చకుండా నేలలో కలియదున్నటం వంటి వివిధ అంశాల పై రైతులకు అవగాహన కల్పించారు.శాస్త్రవేత్త డా.సుమలత మాట్లాడుతూ వివిద పంటలలో చీడపీడల నివారణ, రసాయన మందుల వాడకం పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి కమల్ల మహేష్ మాట్లాడుతూ మార్కెట్ లో డిమాండ్ ఉన్న సన్న వరి రకాలయిన బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638, జెజిఎల్ 1798, జై శ్రీరామ్ ,హెచ్ఎంటి వంగడాలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి అర్చన, వ్యవసాయ విస్తరణ అధికారి బలిజపెల్లి సందీప్, ఉద్యానవన విస్తరణ అధికారి వంశీ, అభిగ్న (టీచింగ్ అసోసియేట్), గోడిశెలపేట గ్రామ సర్పంచ్ కందికట్ల అమృత-రాజేశం, శానబండ సర్పంచ్ గాధం భాస్కర్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాంత్ కుటుంబానికి చేయూతగా డా. సత్తు మల్లేష్ రూ.10,000 ఆర్థిక సహాయం

**( శరత్ రావు - ప్రజాతీర్పు బ్యూరో, కరీంనగర్) ఏప్రిల్ 30**



ఆటో డ్రైవర్ శ్రీకాంత్ ఆత్మ హత్య అనంతరం తీవ్ర ఆర్థిక, సామాజిక ఇబ్బం దులు ఎదు ర్కొం టున్న ఆయన కుటుం బానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. సత్తు మల్లేష్ చేయూతనందించారు. ఘటనపై సమాచారం అందుకున్న ఆయన స్పందించి, తన అనుచరుల ద్వారా రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇంటి యజమాని 12 రోజుల తర్వాత మాత్రమే ఇంటికి రావాలని చెప్పడంతో, మృతుని భార్య తన ఇద్దరు చిన్నారులతో కలిసి స్మశాన వాటికలోనే తలదాచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విషయాన్ని గమనించిన డా. మల్లేష్, కుటుంబానికి తక్షణ ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో సహాయం అందించారు. అదేవిధంగా, బాధిత కుటుంబానికి భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయం అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా చిన్నారుల విద్యాభ్యాసం, వారి సంక్షేమం కోసం నిరంతరం అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.

# దళిత రత్నా అవార్డుల ప్రదానం

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**(దుర్గం నగేష్, ప్రజాతీర్పు, పెద్దపల్లి ప్రతినిధి) ఏప్రిల్ 30**




మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన సన్మాన కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, దళిత రత్నా అవార్డులను ప్రదానం చేశారు.సమాజ సేవ, విద్య, సామాజిక చైతన్యం రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులను ఈ అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను అభినందించిన ఎంపీ వంశీకృష్ణ, మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తదనంతరం మాట్లాడుతూ, దళిత యువత కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలను సాధించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత సేవల్లో ప్రవేశించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. చదువు ద్వారానే గౌరవం, అవకాశాలు, స్వాభిమానం లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, సామాజిక కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మే 5న ఉద్యోగుల సామూహిక నిరాహార దీక్షలు

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఏప్రిల్ 30.**



ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మే 5న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సామూహిక నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని పి.ఆర్.టి.యు.టి.ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోయినపల్లి ఆనందరావు పిలుపునిచ్చారు. 206 సంఘాలతో ఏర్పడిన టీజీఈజేఏసీ విస్తృత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మే 5వ తేదీన జిల్లా కేంద్రంలో ఒక రోజు "సామూహిక నిరాహార దీక్ష" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం జగిత్యాల అర్బన్ మండలం గోపాలరావుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పదవీ విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యాయులు బండపల్లి పవన్ కుమార్ గారి సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆనందరావు మాట్లాడుతూ జూన్ 2లోపు పిఆర్సి అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను ఒకేసారి చెల్లించాలని, హెల్త్ కార్డులను వెంటనే అమలు చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని, 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని దాదాపు 15 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఈ నిరాహార దీక్ష నిర్వహిస్తున్నందున ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం పదవీ విరమణ పొందుతున్న బండపల్లి పవన్ కుమార్ గారి సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రకళ, గ్రామ సర్పంచ్ దావ తిరుపతి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ భారతి, ప్రధానోపాధ్యాయులు రమేష్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సత్యరాజ్, వెంకటరమణ, పెన్షనర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిచాల రవీందర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుల ఆర్థిక సాయం

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) ఏప్రిల్ 30:**

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం రాజక్కపల్లి గ్రామంలో ఇటీవల విద్యుత్ అఘాతంతో దుర్మరణం చెందిన కుశనపెల్లి శ్రీనివాస్, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన సంగ మల్లవ్వ ల కుటుంబాలకు మండల కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచన మేరకు కుశనపెల్లి శ్రీనివాస్ కుటుంబాన్ని గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.10000 ఆర్థిక సాయం అందించారు. విద్యుత్ శాఖ ద్వారా అందించే ఆర్థిక సాయం తక్షణమే అందేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాస్ తో చరవాణి ద్వారా మాట్లాడారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన సంగ మల్లవ్వ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 20000 ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, ఎండపల్లి ఫ్యాక్స్ మాజీ చైర్మన్ మద్దుల గోపాల్ రెడ్డి, గూడ రాంరెడ్డి, రాజక్కపల్లె సర్పంచ్ దొరిశెట్టి మల్లేశం, మార్కెట్ కమిటీ ఇంచార్జి చైర్మన్ గోళ్ల తిరుపతి, ఎండపల్లి మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు సంగ రమేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండాటి సందీప్ రెడ్డి, బందెల ఉదయ్ గౌడ్, కొంగల జగదీశ్వర్ రెడ్డీ, మర్రి పోచయ్య, మెరుగు మురళి, మన్నె జితేందర్, మంతెన లక్ష్మణ్, తోడేటి బాల్ లింగం గౌడ్, దేవి రవీందర్, భూసారపు అశోక్, పొట్లపల్లి సత్యనారాయణ రావు, కనుకుట్ల రఘు, శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ బాధితుల రిలే నిరాహార దీక్ష

### ఎమ్మెల్యే మల్లారెడ్డి సంఘీభావం

**(వినోద్, ప్రజా తీర్పు, జవహర్ నగర్,మేడ్చల్ జిల్లా) ఏప్రిల్ 30 :-**

మేడ్చల్ జిల్లా మేడ్చల్ నియోజకవర్గం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న బాధితుల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా దీక్ష శిబిరంలో ఉన్న బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డ్ కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జేఏసీ నాయకులకు సంఘీభావం తెలియజేసి, వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలకు భంగం కలిగించే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి,వెంకటేష్,ప్రజా తీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఏప్రిల్ 30**

వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల 1, తిమ్మాపూర్ గ్రామాలలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చే సమయంలో నిబంధన ప్రకారం మట్టి గడ్డలు, తప్ప, తేమ ఇతర నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసిన తర్వాత ఆన్ లైన్ లో ట్రక్ షీట్ జనరేట్ చేయబడుతుందని, కొనుగోలు కేంద్రం, మిల్లుల టాగింగ్ ఆటోమేటిక్ గా అవుతుందని, ధాన్యం లారీ పక్కదారి పట్టకుండా జిపిఎస్ పరికరం బిగించబడి ఉంటుందని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును దృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని రైతులు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని 30 పడకుల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అవుట్ పేషెంట్ రిజిస్టర్, మందుల నిల్వలు, ల్యాబ్, వార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వేసవి దృష్ట్యా వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో కొనసాగుతున్న పోస్టుమార్టం గది నిర్మాణ పనుల వివరాలు తెలుసుకొని త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు

**పెద్దపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 30 (ప్రజా తీర్పు):**

రైతులకు ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం కట్టుబడి ఉందని పెద్దపల్లి శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు తెలిపారు. ఎలిగేడు మండలంలోని ధుర్శనిమియాపేట, సుల్తాన్పూర్, ముప్పిరితోట, ర్యాకలదేవుపల్లి గ్రామాల్లో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను గురువారం రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ కాలంలో రైతులు కొనుగోలు కేంద్రాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతుల పక్షపాతిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ధాన్యానికి గింజ కోతలు లేకుండా కొనుగోలు జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, రైతుల సంక్షేమమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## కర్ణ వేదన కార్యక్రమానికి హాజరైన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేష్

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (ప్రజా తీర్పు)**



భీమారం లో వేల్పుల శ్రీనివాస్ అరుణ వాళ్ళ కూతురు నిగమ కర్ణ వేదన మహోత్సవానికి విచ్చేసి ఆశీర్వదించిన గొల్లపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తమ్మినవేని రాజేష్, మరియు గొల్లపల్లి తోటి మిత్రులు రేచవేని రాజేష్, రేచవేని రవి, వేల్పుల పర్వతాలు, మెండే కిష్టయ్య , ధర్మరాజుల సంతోష్, మంచెల్ల మల్లేష్, మరియు వేల్పుల శ్రీను పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం లో ప్రోటోకాల్ రగడ

- ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సమక్షంలో దేగాం సర్పంచ్ సుష్మరెడ్డి ఆగ్రహం

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే, ప్రజా తీర్పు భైంసా) ఏప్రిల్ 30**

భైంసా మండలంలోని దేగాం గ్రామం లో గురువారం ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం లో ప్రోటోకాల్ వివాదం చోటుచేసుకుంది. ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, స్థానిక సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి హాజరయ్యారు.అయితే ఈ సందర్భంలో మాజీ ఎమ్మెల్యే చే ప్రారంభం చేయాలని అయన వర్గీయులు కోరగా సర్పంచ్ సుష్మరెడ్డి అడ్డుకున్నారు.. తాను సర్పంచ్ నని ప్రజాప్రతినిధులను అ గౌరవపరుస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై తాను అధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.ప్రజలు ఆశీర్వదించి నన్ను సర్పంచ్ గా చేస్తే అధికార పార్టీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఏ అధికారం ఉందని మాజీ ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ లు చేస్తున్నారన్నారు. నన్ను కాదని ఒక వార్డు మెంబర్ తో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి రిబ్బన్ కట్ చేయించాడంటే సర్పంచ్ లకు ఇస్తున్నా గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు..ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని అధికార పార్టీ లో ఉన్నామని ఇష్ట రాజ్యాంగా ప్రవర్తిస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు.. ఇందిరమ్మ కమిటీలకు సర్పంచ్ లే చైర్మన్ గా ఉంటారన్న విషయాన్ని మాజీ ఎమ్మెల్యే,తెలుసుకోవాలన్నారు.దేగాం గ్రామానికి ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ఇండ్లు మంజూరు చేయిస్తే, తాను మంజూరు చేయించానని చెప్పుకుంటూ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అధికారికంగా ప్రారంభోత్సవాలకు రావడం సరికాదన్నారు. అతిథిగా ఆహ్వానిస్తే మళ్లీ అధికార దర్పం ప్రదర్శించడం ఏంటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తే తాను చట్ట ప్రకారం ఫిర్యాదు చేస్తానన్నారు.

# మే 15 లోపు కేంద్రియ విద్యాలయంకు స్థలం కేటాయింపు చెయ్యాలి

- బిజెపి రాష్ట్ర నాయకురాలు డాక్టర్ బోగ శ్రావణి ప్రవీణ్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) ఏప్రిల్ 30**



విద్యార్థుల భవిష్యత్ తో నాయకులు చెలగాటం ఆడడం సరికాదని, తక్షణమే కేంద్రియ విద్యాలయం కు స్థలం కేటాయించాలని బిజెపి రాష్ట్ర నాయకురాలు డాక్టర్ బోగ శ్రావణి డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ జగిత్యాల జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నవోదయ, కేంద్రియ విద్యాలయాలను మంజూరు చేసిందన్నారు. కోరుట్ల లో ఏర్పాటూ చేసిన నవోదయ విద్యాలయం ఏర్పడి, ఏడాది కాలం పూర్తయ్యిందని గుర్తు చేశారు. కానీ జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామంలో వాలంతరి లో స్థలం 10 ఎకరాలు కేటాయించడం ఎందుకు ఇబ్బంది అవుతుందో స్థానిక ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఏ పార్టీలో ఉన్నాడో తెలియని నాయకులు, అభివృద్ధి కోసం పార్టీ మారిన నాయకులు, అభివృద్ధికి చిహ్నంగా నిలిచే కేంద్రియ విద్యాలయంకు స్థలం కేటాయించడంలో ఎందుకు తాత్సరం చేస్తున్నారని శ్రావణి ప్రశ్నించారు. నిజామాబాద్ లోని కలికోట లో ఎప్పుడో స్థలం కేటాయింపు జరిగిందని, వనపర్తి లో స్థలం కేటాయింపు జరిగిన జగిత్యాలలో ఎందుకు స్థల కేటాయింపునకు నిర్లక్ష్యం చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సీఎం, మంత్రులను కలిసి అభివృద్ధికి పాటుపడే ఎమ్మెల్యే గారూ, ఫోటోలు, ప్రెస్ మీట్ లు పెట్టి ప్రచారం చేసుకోవడం మానుకోవాలని, పనిచేసి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని శ్రావణి హితవు పలికారు. విద్యార్థుల భవిష్యత్ తో స్థానిక ఎమ్మెల్యే ఆడుకుంటున్నారని, స్వార్థం, స్వలాభం కోసం ఎమ్మెల్యే ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. జగిత్యాల నియోజకవర్గం లో కేంద్రియ విద్యాలయం స్థలం కేటాయింపు విషయంలో జిల్లా మంత్రి జోక్యం చేసుకోకపోవడం విచారకరం అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడికి మంత్రి తలోగ్గారా? లేదా మంత్రి జగిత్యాల విషయంలో జోక్యం చేసుకోవడం లేదా అనే విషయం పై స్పష్టత ఇవ్వాలన్నారు. కేంద్రియ విద్యాలయం స్థలం కేటాయింపు విషయంలో నిర్లక్ష్యం పై జిల్లా మంత్రి తక్షణమే స్పందించాలన్నారు. జిల్లా అభివృద్ధి గురించి గాని, జిల్లా ప్రజల గురించి గానీ, జిల్లా విద్యార్థుల భవిష్యత్ పై మంత్రిగారికి కనీసం బాధ్యత లేదా అని శ్రావణి గారూ ప్రశ్నించారు. కేంద్రియ విద్యాలయం స్థలం కేటాయింపు విషయం పై నాయకుల చిత్తశుద్ధి లోపమా? లేదా లోపాయికారి ఒప్పందమా అనేది అనుమానం కలుగుతుందన్నారు. కేంద్రియ విద్యాలయానికి స్థలం కేటాయింపు చేయాలనీ, ఏ పార్టీలో ఉన్నాడో తెలియని ఎమ్మెల్యేని, జిల్లా మంత్రిని, ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నామని, మే 15 లోపు స్థలం కేటాయింపు జరగకపోతే, మే 15 న జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆర్డివో కార్యాలయం ఎదుట కేంద్రియ విద్యాలయం కు స్థలం కేటాయించాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి గారు నిరాహార దీక్ష చేపడతారు. విద్యార్థుల భవిష్యత్ కు భారతీయ జనతా పార్టీ ఎంత దూరం అయినా వెళ్తామని హెచ్చరించారు. కేంద్రియ విద్యాలయం రావడం కేవలం విద్యార్థుల భవిష్యత్ కోసం మాత్రమే కాదని, ఈ విద్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంత అభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. కాబట్టే కేంద్రియ విద్యాలయం ప్రాధాన్యత, విద్యార్తుల భవిష్యత్, ప్రాంత అభివృద్ధికై తప్పనిసరిగా నిరాహార దీక్ష చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు,జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్,42వ వార్డ్ కౌన్సిలర్ మిమ్మల నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు,జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్,జిల్లా కార్యదర్శి పాత రమేష్,పూదరి శ్రీనివాస్, సిరిపురం శ్రీనివాస్, గట్టిపల్లి జ్ఞానేశ్వర్,పవన్ సింగ్,రవితేజ, గంగరాజం పాల్గొన్నారు.

## కల్వకోల్ గ్రామంలో గుడిసెలు లేకుండా చేయడమే లక్ష్యం

**(వై యాదగిరి, ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) ఏప్రిల్.30**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని కల్వకోలు గ్రామంలో.. గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ రవి ఆధ్వర్యంలో.. ఇంది రమ్మ ఇంటికి భూమి పూజ చేయడం జరిగింది.. గ్రామంలో జ్ఞానాది రమ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరిగింది నిర్మాణం సర్పంచ్ మాట్లాడుతూ ఇంకా ఎవరైనా ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవాలి అనుకునే వాళ్ళు ముందుకు రావాలి.. గ్రామంలో గుడిసెలు రేకులు ఇండ్లు లేకుండా చేస్తాం.. అంటూ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ రవి మాదిగ తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉప సర్పంచ్ జనార్ధన్ గౌడ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు సాయిని గోపాల్ రెడ్డి అరటి కుమార్ శ్రీనివాస్ చారి వినయ్ చారి పరమేష్ చారి ప్రభాకర్ తదితరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

**(వి.వెంకటేష్, ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) ఏప్రిల్ 30**

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల పంచాయతీ అధికారి సుమన్ తో కలిసి సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. వేసవి దృష్ట్యా వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. గర్భిణుల ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరిగే విధంగా ఆశ, ఆరోగ్య కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు.

### హెడ్ కానిస్టేబుల్ బి. రాజయ్య సన్మానం

**రామగుండం, ఏప్రిల్ 30,( ప్రజాతీర్పు):**

ఉద్యోగ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ బి. రాజయ్యను గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆత్మీయంగా సన్మానించారు. అడిషనల్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ (పరిపాలన) కె. శ్రీనివాస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజయ్యకు పూలమాల వేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, సమాజ భద్రత కోసం నిరంతరం శ్రమించే పోలీసు శాఖ సేవలు అపారమని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖలో రాజయ్య చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ సహచరులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శేఖర్, రమేష్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం, సభ్యుడు నసీర్ తదితరులు పాల్గొన్నారు.



# 'ఉద్యమ్ రిజిస్ట్రేషన్'పై అవగాహన సదస్సు

**జమ్మికుంట ఏప్రిల్ 30 (ప్రజాతీర్పు)**

మెప్మా ఆధ్వర్యంలో స్థానిక వినాయక గార్డెన్ గురువారం 'ఉద్యమ్ రిజిస్ట్రేషన్' ప్రక్రియపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో, టీఎల్ఎఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కరీంనగర్ పిడి స్వరూప రాణి, మున్సిపల్ చైర్ పర్సన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం, వ్యాపార సంస్థల పెట్టుబడి, వార్షిక టర్నోవర్‌ను ప్రాతిపదికగా తీసుకుని వాటిని వర్గీకరిస్తూ, వ్యాపార లావాదేవీలను సులభతరం చేసేందుకు, ప్రభుత్వ పథకాలు పొందడానికి ప్రతి యంఎస్ఎంఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ద్వారా శాశ్వత గుర్తింపు పొందాలని వారు సూచించారు. ఈ రిజిస్ట్రేషన్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, చిరు వ్యాపారులు దీనిని వినియోగించుకోవాలని కోరారు. వ్యాపార రంగంలో పారదర్శకత, ప్రభుత్వ చేయూత అందాలంటే ప్రతి చిన్న, మధ్య తరహా పరిశ్రమ తప్పనిసరిగా ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఎంసీ శ్రీవాణి, డీపీఎం సతీష్, ఇంచార్జి టి.ఏం.సి. మల్లీశ్వరి, సీఎల్ఆర్పీలు మంజుల, జ్యోతి, ఆర్పీలు, ఓబీలు పలువురు పాల్గొన్నారు.



# గుండెపోటుతో మున్సిపల్ కార్మికుడి మృతి

● కుటుంబ సభ్యులను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) ఏప్రిల్ 30**

వేములవాడ మున్సిపల్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న వేములవాడ పట్టణం సుభాష్ నగర్ కు చెందిన చింతల్ తాడెం లింగయ్య ఈరోజు గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు వెంటనే చేరుకుని, లింగయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చుతూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. లింగయ్య మరణవార్తతో పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొని నివాళులర్పించారు.

# స్వీయ గణన ప్రక్రియ ద్వారా జనగణన వేగవంతం

● జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) ఏప్రిల్ 30**




జనగణన-2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియ ద్వారా కార్యక్రమం వేగవంతం అవుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం సబ్బెపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన గణనను 2 విడతలుగా నిర్వహించడం జరుగుతుందని, మొదటి విడతలో మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన, 2వ విడతలో జనగణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి నాణ్యమైన, స్పష్టమైన జాబితా రూపొందించడం జరుగుతుందని, ఇందు కొరకు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు తగు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు జరగనున్న స్వీయ గణన ద్వారా జనగణన ప్రక్రియ వేగవంతం అవుతుందని తెలిపారు. స్వీయ గణన కార్యక్రమం నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రముఖ వ్యక్తులు, గణన అధికారులు, యువత, స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రజలందరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా స్థాయి జనగణన అధికారులు ప్రతిరోజు స్వీయ గణన వివరాలను నవీకరించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో స్వీయ గణనపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు స్వీయ గణన కార్యక్రమ కార్యచరణను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు జనాభా ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో స్పష్టమైన జాబితా రూపొందించేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని తెలిపారు. మే 10వ తేదీ వరకు ఆన్ లైన్ లో ష్ట్రజూం://వ.ఎవఅంబం.స్త్రశీజ.ఱఅ వెబ్ సైట్ ద్వారా స్వీయ గణన చేసుకోవచ్చని, ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నెంబర్ వినియోగించాలని, ఇండ్ల గణనకు సంబంధించి 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి రివ్యూ ద్వారా పరిశీలించుకోవాలని తెలిపారు. మే 11వ తేదీ నుండి ఇండ్ల గణన అధికారులు కార్యక్రమంలో భాగంగా ఇంటికి వచ్చినప్పుడు ఈ నెంబర్ ను అందించాలని తెలిపారు. ఆ సమయంలో ఏమైనా మార్పులు ఉన్నట్లయితే ఎన్యుమరేటర్ ద్వారా సవరించుకోవచ్చని తెలిపారు. వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళలలో తమకు కేటాయించిన బ్లాక్ లలోని ఇండ్లను సందర్శించేలా కార్యచరణ రూపొందించుకోవాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి.వెంకటేష్,ప్రజా తీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) ఏప్రిల్ 30**

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల సాయికుంట ప్రాంతంలో చేపట్టిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ విభాగాల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు మరింత వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 129.25 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయల వ్యయంతో క్రిటికల్ కేర్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారులు గుత్తేదారుల సమన్వయంతో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి దరఖాస్తుల పరిష్కారం వివరాలను పరిశీలించారు. భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63, 163 జి రహదారుల ఏర్పాటులో భాగంగా జిల్లాలోని ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 5 నుంచి పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

### గడువులోపు ఫీజు చెల్లించాలని డీఈఓ శారద సూచన

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు, పెద్దపల్లి ప్రతినిధి) ఏప్రిల్ 30**



పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5 నుండి ప్రారంభం కానున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద తెలిపారు. మార్చి 2026లో నిర్వహించిన ఎస్సెస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థుల కోసం ఈ పరీక్షలు జూన్ 5 నుంచి జూన్ 12 వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సమయం పరిమితంగా ఉన్నందున రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫలితాల కోసం వేచి చూడకుండా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. 2026 ఎస్సెస్సీ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులతో పాటు 2015 సీసీఈ విధానంలో ఉత్తీర్ణత సాధించని అభ్యర్థులు కూడా ఈ పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. అభ్యర్థులు తమ పరీక్ష ఫీజును సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఆన్‌లైన్ ట్రెజరీ విధానంలో చెల్లించాలని సూచించారు. ఫీజు చెల్లింపు ప్రక్రియ ఏప్రిల్ 30 నుంచి మే 14 వరకు కొనసాగుతుందని తెలిపారు. హెడ్‌మాస్టర్లు ఈ-ఎన్ఆర్ వివరాలను మే 15లోపు జిల్లా విద్యాశాఖాధికారికి సమర్పించాల్సి ఉండగా, జిల్లా స్థాయి అధికారులు మే 16లోపు ప్రభుత్వ పరీక్షల కార్యాలయానికి ఆన్‌లైన్ ద్వారా పంపాలని ఆదేశించారు. ఆలస్య రుసుము రూ. 50తో సంబంధిత పరీక్ష ప్రారంభానికి రెండు రోజుల ముందు వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, విద్యార్థులు గడువులను తప్పకుండా పాటించి సమయానికి ఫీజు చెల్లించి దరఖాస్తులు సమర్పించాలని డీఈఓ శారద సూచించారు.




# క్లిష్ట శస్త్రచికిత్సలో మైలురాయి సాధించిన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి

### మొట్టమొదటిసారి స్కిన్ గ్రాఫ్టింగ్ విజయవంతం

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు, పెద్దపల్లి ప్రతినిధి) ఏప్రిల్ 30**



క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మరో మైలురాయి సాధించింది. పట్టణానికి చెందిన 28 ఏళ్ల మహిళ కాలిన గాయాలతో గత నెల ఆసుపత్రికి చేరగా, వైద్య బృందం సమన్వయంతో చికిత్స అందించి, చివరికి స్కిన్ గ్రాఫ్టింగ్ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ సూచనల మేరకు ప్రారంభంలో రెండు రోజులపాటు డా. సాయిప్రసాద్, డా. విష్ణు చంద్రికల ఆధ్వర్యంలో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉన్నత కేంద్రానికి తరలించగా, పేషెంట్ కొంత కోలుకున్న తర్వాత మళ్లీ పెద్దపల్లి ఆసుపత్రిలో గత 15 రోజులుగా చికిత్స కొనసాగించారు. ఈ క్రమంలో ప్లాస్టిక్ సర్జన్ డా. అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో స్కిన్ గ్రాఫ్టింగ్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. పెద్దపల్లి ఆసుపత్రిలో ఇలాంటి శస్త్రచికిత్స జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ శస్త్రచికిత్సలో డా. అశోక్ రెడ్డి (ప్లాస్టిక్ సర్జన్), డా. సాయిప్రసాద్ (జనరల్ సర్జన్), డా. స్వాతి (అనస్థీషియా నిపుణులు) కీలక పాత్ర పోషించారు. వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డా. శ్రీధర్ అభినందించారు. అనంతరం డా. అశోక్ రెడ్డిని ఆసుపత్రి సిబ్బంది సన్మానించారు. ఈ విజయంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి పై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగింది.




# ప్రమాదంలో గాయపడిన కొలిపాక పర్వతాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యేపుట్ట మధూకర్

**కమాన్‌పూర్, ఏప్రిల్ 30 (ప్రజాతీర్పు)**

కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేట్ గ్రామానికి చెందిన కొలిపాక పర్వతాలు ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడగా, మంథని మాజీ శాసనసభ్యులు పుట్ట మధూకర్ వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి మనోధైర్యం కల్పించారు.

# పెద్దమ్మ తల్లి బోనాల జాతర లో రసమయి బాలకిషన్

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట) ఏప్రిల్ 30**



గాలిపెల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల జాతర పాల్గొని కొబ్బరికాయ కొట్టి మొక్కు చెల్లించుకున్న రసమయి బాలకిషన్ . స్థానిక సర్పంచ్ బద్దం శేఖర్ రెడ్డి మరియు పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు రసమయి ని సన్మానించారు... అనంతరం మండలంలో పలు వివాహాల కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా జెడ్పి మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఒల్లాల ప్రభాకర్ గౌడ్ మాజీ పిఎసిఎస్ వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి, దేవేందర్ రెడ్డి,గొడిశెల జితేందర్ గౌడ్,వెంకటేశం, రవీందర్ గౌడ్, ర్యాగటి రమేష్,శ్రీనివాస్,ఎడ్ల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కిషన్, నరేష్, రవీందర్ రెడ్డి, పిల్లి వేణు,వరుకోలు సంతోష్, పొన్నాల తిరుపతి, ముత్యం, నంది రాజు, ఓర్పుల రాములు, శేఖర్,మాజీ ప్రజా ప్రతినిధులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# లేబర్ కోడ్‌ల రద్దు వరకు పోరాటం కొనసాగుతుంది

## సింగరేణి సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మెకు నోటీసు : ఏఐటీయుసి



**గోదావరిఖని, ఏప్రిల్ 30,(ప్రజా తీర్పు):**

కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్ తెలిపారు.గోదావరిఖనిలోని భాస్కర్ రావు భవన్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన యూనియన్ సాధారణ సభలో ఆయన మాట్లాడారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, కార్మికులకు నష్టం కలిగించే విధంగా లేబర్ కోడ్‌లను అమలు చేస్తున్నదని విమర్శించారు. ఈ కోడ్‌లు అమల్లోకి వస్తే పని గంటలు పెరగడం, జీతాల పెంపు యాజమాన్య నిర్ణయాలపై ఆధారపడడం, ఉద్యోగ భద్రత తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. లేబర్ కోడ్‌ల రద్దు కోసం మే డే స్ఫూర్తితో ఉద్యమాలు చేపట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు.సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను మే మొదటి వారంలోగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డు పునరుద్ధరణ, మారుపేర్ల సమస్యలు, ప్రమోషన్లు వంటి అంశాలను వెంటనే పరిష్కరించకపోతే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని మే రెండో వారంలో సమ్మె నోటీసు ఇస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏఐటియుసి, సీపీఐ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కె. కనకరాజ్, మాదన మహేష్, సంకె అశోక్, బోగ సతీష్‌బాబు, పి. విజయలక్ష్మి, ఎం.ఎ. గౌస్ తదితరులు పాల్గొన్నారు.



## ఆడబిడ్డ పెళ్లికి అండగా సేవా సంస్థలు

### కూలర్ అందజేసిన మెడికల్ అసోసియేషన్ సభ్యులు

**గోదావరిఖని, ఏప్రిల్ 30 (ప్రజా తీర్పు):**

ఆర్థిక ఇబ్బందులతో కుమార్తె వివాహం నిర్వహించేందుకు కష్టపడుతున్న కుటుంబానికి స్థానిక సేవా సంస్థలు అండగా నిలిచాయి. గోదావరిఖని 5 ఇంక్లైన్ ప్రాంతానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ తన కుటుంబాన్ని పోషించుకుంటూ కుమార్తె పెళ్లి నిర్వహించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సహాయం అందించారు.ఈ నెల 28న రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో గోదావరిఖని కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో పెళ్లి కూతురు కుటుంబ సభ్యులకు కూలర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ డా. కె. రాజేందర్ హాజరై మాట్లాడుతూ, సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు.వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్, చైర్మన్ డా. సురభి శ్రీధర్ మాట్లాడుతూ, ఆడబిడ్డ పెళ్లికి సహాయం కోరగానే మెడికల్ అసోసియేషన్ సభ్యులు వెంటనే స్పందించి తమ వంతు సహాయం అందించారని తెలిపారు.తమ సంస్థ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ సభ్యులు పి. సతీష్, పి. శ్రీనివాస్, ఎన్. కరుణాకర్ రెడ్డి, డి. విష్ణుమూర్తి, బి. రాజేందర్, ఇ. సురేందర్, కె. వెంకన్న, జె. చారి, ఎ. రాజశేఖర్, బి. జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్ భవేష్ మీశ్రాను మర్యాదపూర్వకంగా కలిసిన కౌన్సిలర్లు, నాయకులు

**ఖానాపూర్ ఏప్రిల్ 30 (ప్రజా తీర్పు ప్రతినిధి)**



నిర్మల్ జిల్లాకు నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన భవేష్ మీశ్రా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన నిర్మల్ జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, కౌన్సిలర్ నిమ్మల రమేష్, నాయకులు జమల్ ఖురేషి,తూము చరణ్, శ్రీపాద శేషాద్రి లు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ నీ శాలువ తో సత్కరించి బొకే ను అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వాగతం పలికారు.



## ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులను సన్మానించిన యువ నాయకుడు కోలా శ్రీకాంత్

**సూరారం, ఏప్రిల్ 30 (ప్రజా తీర్పు)**

బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు కోలా శ్రీకాంత్ ముదిరాజ్ఆధ్వర్యంలో సూరారంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఇటీవల ప్రకటించిన 10వ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణులై మొదటి మరియు రెండవ స్థానాలు సాధించిన విద్యార్థులను నేడు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం పాఠశాల ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ దేవి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో వారికి ప్రైజ్ మనీ, పుస్తకాలు మరియు వాటర్ బాటిల్స్‌ను బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రామ్ నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, డేవిడ్, చంద్రశేఖర్, విక్రమ్ రెడ్డి, ప్రసాద్, విక్రమ్, అనేఫ్, వికాస్, సాయి కుమార్, శివ, చంటి, సలీం తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయం టీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్

**(వినోద్, ప్రజా తీర్పు,మేడ్చల్ జిల్లా) ఏప్రిల్ 30**



మేడ్చల్ జిల్లా మునీరాబాద్ పరిధిలోని అద్వయ కన్వెన్షన్ సెంటర్‌లో ఇటీవల నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఆవిర్భావ సభ ఘన విజయవంతమైందని పార్టీ నాయకులు తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, మహిళలు, యువత, రైతులు, వివిధ వర్గాల ప్రతినిధులు తరలివచ్చి సభను విజయవంతం చేశారు. జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో నిర్వహించిన ఈ సభలో తెలంగాణ రాష్ట్ర రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రకటనలు వెలువడ్డాయి. సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా కొత్త రాజకీయ ప్రత్యామ్నాయంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని ప్రకటించారు. సభ ప్రాంగణం పార్టీ జెండాలు, నినాదాలతో మార్మోగిపోయింది. పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరై తెలంగాణ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, యువత ఉపాధి, రైతు సంక్షేమం అంశాలపై మద్దతు తెలిపారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ "పంచజన్యం" పేరుతో ఐదు ప్రధాన హామీలను ప్రజల ముందుంచారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, యువతకు భారీ ఉద్యోగావకాశాలు, అన్ని వర్గాలకు సమాన న్యాయం అందించడమే పార్టీ లక్ష్యమనిపేర్కొన్నారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి, మేడ్చల్ నాయకుడు రామిడి వెంకట్ రెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంచిరెడ్డి విజయ్ కిరణ్ రెడ్డి మాట్లాడుతూ, మేడ్చల్‌లో జరిగిన ఈ సభ తెలంగాణ రాజకీయ చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. అద్వయ కన్వెన్షన్ సెంటర్ వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేయగా, వాహనాల రాకపోకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సభ అనంతరం కార్యకర్తలు సంబరాలు జరుపుకుని మిఠాయిలు పంచుకున్నారు.

# ఉద్యోగ విరమణ అభినందన సభ

**(కపిల్ వాఘ్మారే సీఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) ఏప్రిల్ 30**



ప్రభుత్వ ఉద్యోగంలో చేరి 35 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలో ప్రజలతో మమేకమై ఉద్యోగ బాధ్యతలను నీతి నిజాయితీతో పాటు ఓపిక సహనానికి మారుపేరుగా జాడే లక్ష్మణ్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులుగా పనులు చేశారని వారిని ప్రజ్ఞ శీల అసోసియేషన్ తో పాటు ఎస్సీ ఎస్టీ ఉద్యోగాల సంఘం పలువురు ఉపాధ్యాయులు రాజకీయ నాయకులు భారతీయ బౌద్ధ మహా సభ సభ్యులు కలసి పదవి విరమణ అభినందన సభ ఏర్పాటు చేసి వారికి అభినందించారు. గురువారం బృందావనం గార్డెన్ లో పదవి విరమణ అభినందన సభ ఏర్పాటు చేశారు.ముందుగా గౌతమ బుద్ధుడు అంబేద్కర్ చిత్రపటాలకు కొవ్వొత్తులు వెలిగించి పూల దండాలు వేసి బౌద్ధ సాంప్రదాయాల ద్వారా బుద్ధ వందన చేశారు.అనంతరం మాడే సురేదాస్ మాట్లాడుతూ జాడే లక్ష్మణ్ నేను డిగ్రీ వరకు కలసి పూర్తి చేశామని అన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ దయవల్ల ఈ స్థాయిలో ఉన్నామని అన్నారు.ఇంటర్ మీడియాట్ లో తెలుగు మీడియం వరకు పూర్తి చేశామని గుర్తు చేశారు. చాలా పేద కుటుంబం నుంచి వచ్చి చదువులు పూర్తి చేశామని అన్నారు. చదువు కోవడానికి బస్సులు సౌకర్యం లేకుండే కష్టపడి చదవి ఉద్యోగాలు సంపాదించుకున్నాం కన్నీళ్లు పెట్టుకున్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని అన్నారు.గోపాల్ మాట్లాడుతూ కామోల్ గ్రామంలో పాఠశాలలో జాడే లక్ష్మణ్ నేను కలసి పనులు చేశామని అన్నారు. క్రమశిక్షణగా విధులు నిర్వహించామని వారు అన్నారు.వెంకట్ రావు జాదవ్ మాట్లాడుతూ పతి ఉద్యోగాలకు పదవి విరమణ పొందడం సహజం ఎన్నో పేద విద్యార్థులకు చదువు అందించారు అని ఉపాధ్యాయ అంటే ఉద్యమం ప్రభుత్వం పదవి విరమణ పొందుతున్న అప్పటికి బౌద్ధ దమ్మ అంబేద్కర్ గురించి ముందుగు తీసుకొని వెళ్ళాలని కోరారు. ఎందరో పేద విద్యార్థులకు చదువులు అందించి 35 సంవత్సరాలు ఉపాధ్యాయులుగా సేవలు అందించారు.అని వారు అన్నారు.పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేయాలన్నారు.బాజీ రెడ్డి మాట్లాడుతూ వివిధ పాఠశాలలో పేద విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పెన్సిల్ అందచేశారు.ఉపాధ్యాయులకు చాలా సేవ చేశారు అని ఉద్యోగం విరమణ పొందిన తర్వత నిత్యం ప్రజా సేవలు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ హెల్పర్ అసోసిషయన్ అధ్యక్షులు కన్వీనర్ ధర్మాజీ చందనే, ప్రధాన కార్యదర్శి జీ,పుండలిక్,ఉద్యోగ ఉపాధ్యాయ సంఘ నాయకులు బీవీ వెంకట రమణ రావు, భూమన్న, మహేష్,దేవేందర్,దాసరి శంకర్,రవి కిరణ్,గంగాధర్, బల్సా గజ్జరం,గోపాల్,బొడ్డు లక్ష్మణ్.వివిధ సంఘంల నాయకులు పాల్గొన్నారు.



## నాగారం ఉన్నత పాఠశాల విద్యార్థుల ఘన విజయం

### కీసర మండలంలో టాప్ ర్యాంకులు సాధించిన ప్రణీత్, నిహారిక

**(వినోద్, ప్రజా తీర్పు, కిసర, మేడ్చల్ జిల్లా ఏప్రిల్) 30**

మేడ్చల్ జిల్లా కీసర మండలంలోని నాగారం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్ఎస్‌సీ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచి ఘన విజయాన్ని సాధించారు. మండల స్థాయిలోనే మొదటి స్థానంలో ప్రణీత్ 569 మార్కులు, రెండవ స్థానంలో నిహారిక 559 మార్కులు సాధించి పాఠశాలకు గర్వకారణమయ్యారు. ఈ విజయోత్సవ సందర్భంగా పాఠశాల ఆవరణలో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు పీసీ రాములు అధ్యక్షత వహించగా, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ, గత 30 సంవత్సరాలుగా నాగారం గ్రామంలో ఉన్నప్పటికీ మండలంలో అత్యధిక మార్కులు సాధించడం ఈసారి సాధ్యమైందని, ఇది ప్రధానోపాధ్యాయులు పీసీ రాములు మరియు ఉపాధ్యాయ బృందం కృషి ఫలితమని కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, మండలంలోనే అత్యధిక విద్యార్థులు ఉన్న పాఠశాలగా నాగారం ఉన్నత పాఠశాల నిలిచిందన్నారు. ఉపాధ్యాయులు ఎంతో కష్టపడి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని, ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ స్థానిక నాయకుల సహకారంతో విద్యా వాలంటీర్లను నియమించి బోధన కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 500 కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు అరవింద్ కుమార్, మాలోత్ నాయక్, వందన, రఘు, గాయత్రీ, సుప్రజ, సంజయ్ రాణి, మాజీ కౌన్సిలర్ బి. శ్రీనివాస్ గౌడ్, గ్రామ పెద్దలు నక్కా కిషోర్, రాజు గౌడ్, కిషోర్ చారి, రవీందర్ రెడ్డి, రాకేష్ గౌడ్, రవిబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## 10 వ తరగతిలో మంచిర్యాల నారాయణ విద్యార్థుల ప్రభంజనం.

**(అరికిళ్ళ జయ్ కుమార్, ప్రజా తీర్పు మంచిర్యాల మండల్) ఏప్రిల్ 30**

బుధవారం రోజు వెలువడిన తెలంగాణ పదవ తరగతి ఫలితాల్లో మంచిర్యాల నారాయణ హైస్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. నారాయణ పాఠశాలకు చెందిన విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, 32మంది విద్యార్థులలో 25 మందికి పైగా 500 మార్కులకంటే ఎక్కువ మార్కులు తెచ్చుకొని రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి ర్యాంకులను సాధించి మంచిర్యాల నారాయణ పాఠశాల కీర్తిని దశదిశలా చాటారు. ఈ సందర్భంగా పాఠశాల డీజీఎం వెంకటరమణ రెడ్డి , ఏజీఎం చైతన్య రావు మాట్లాడుతూ, విద్యార్థులు సాధించిన ఈ అద్భుత ఫలితాలు, వారు చూపిన పట్టుదల, క్రమశిక్షణకు అధ్యాపకుల నిరంతర కృషితో కూడిన బోధనకు నిదర్శనం అని అన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదివిన విద్యార్థులకు, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు మా అభినందనలు అని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక అభినందనలు తెలియజేసారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం చైతన్య రావు తో పాటుగా, ఆర్ ఐ సత్యం రావు, హై స్కూల్ కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపల్ స్రవంతి, అకాడమిక్ డీన్ వెంకటస్వామి, ఏజీఎం అనాలసిస్ రాజేందర్, ఏవో కిషన్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## చైతన్యపురిలో గృహ ప్రవేశ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ - శైలజ దంపతులు

**మంథని, ఏప్రిల్ 30 (ప్రజాతీర్పు)**

మంథని పట్టణంలోని చైతన్యపురి కాలనీలో బాసాని మంజుల – సత్యనారాయణ నూతన గృహ ప్రవేశ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు పుట్ట మధూకర్ – శైలజ దంపతులు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. గృహ ప్రవేశ వేడుకకు బంధుమిత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు హాజరై కొత్త ఇంటిలో సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించబడింది.



## బేగంపేటలో వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**రామగిరి, ఏప్రిల్ 30 (ప్రజాతీర్పు)**


రామగిరి మండలం బేగంపేట గ్రామంలో తోట్ల కొమురయ్య కుమార్తె కొమలత -- హరీష్ యాదవ్ వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి మంథని మాజీ శాసనసభ్యులు పుట్ట మధూకర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడి వారికి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, అభిమానులు, నాయకులు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు రైతులలో అవగాహన



(వెగ్గళం రాధాకిషన్, ప్రజాతీర్పు ఇల్లంతకుంట) ఏప్రిల్ 30

పత్తికుంట పల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ అధికారులు సంయుక్తంగా వానాకాలంలో చేసే సాగు పంటల పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ టి అరుణ్ బాబు మాట్లాడుతూ వరి, పత్తి మరియు మొక్కజొన్న పంటలలో యూరియా వాడకం తగ్గించాలని సూచించారు. యూరియా వాడకాన్ని తగ్గించుకోవడానికి రైతులు తమ పొలంలో జనుము మరియు జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువులను, జీవన ఎరువులను, సేంద్రీయ ఎరువులు వాడటం ద్వారా అవి పంట దిగుబడిని పెంచడమే కాకుండా భూమిని కూడా సారవంతం చేస్తాయని చెప్పారు. సాధారణంగా తెలంగాణలో వరి పంట 50 శాతానికి పైగా ఉండటం వలన ఇది భూమి సారవంతంని దెబ్బతీస్తుంది కాబట్టి రైతులు వరి పంటలకు బదులుగా పప్పు ధాన్యాలు వంటి పెసర, మినుమ, బొబ్బర్లు మరియు నూనె గింజలు వంటి కుసుమ, ప్రొద్దుతిరుగుడు, ఆముదము, ఆవాలు సోయాబీన్ వంటి పంటల వైపు వెళ్లాలని సూచించారు, ఇది రైతులకు లాభాన్ని ఇవ్వడమే కాకుండా భూమి ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిన సన్న రకం వరి రకాలు కూనారం వరి 2, తెలంగాణ సోనా, సిద్ధి మరియు సాంబ మసూరి పంట రకాలను సాగు చేయాలని సూచించారు. రసాయనాలను అధిక మొత్తంలో వాడకుండా అవసరమైన మేరకే వినియోగించాలని, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని తద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలని రైతులకు చెప్పారు. నీటి వినియోగం ఆరుతాడి మరియు డ్రిప్ ఇరిగేషన్ పద్ధతుల ద్వారా తగ్గించుకోవాలని తద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి జి. ప్రవీణ్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు చెప్పిన పద్ధతులను రైతులు వానకాలంలో అవలంబించి సాగు ఖర్చులని తగ్గించుకుంటూ లాభాలను పొందాలని చెప్పారు. వ్యవసాయ శాఖ వారు ఆయిల్ పామ్ సాగునుప్రోత్సహించడానికి డ్రిప్ ఇరిగేషన్ కు సబ్సిడీ అందిస్తున్నారని తెలియజేశారు. వ్యవసాయ విస్తరణ అధికారిని అర్చన మాట్లాడుతూ రైతులు వచ్చే వాన కాలంలో రాష్ట్ర ప్రభుత్వము సిఫార్సు చేసిన సన్నరకం వడ్లను పండించి లాభాలు పొందవచ్చును అని చెప్పారు అదేవిధంగా ఎటువంటి సన్న రకాలను వాడుకోవాలో రైతులకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త మరియు వ్యవసాయ అధికారులు, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాబు జగజీవన్ రామ్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి అరుణ్ బాబు, మండల వ్యవసాయ అధికారి జి ప్రవీణ్, వ్యవసాయ విస్తరణ అధికారిని అర్చన, గ్రామ సర్పంచ్ జుట్టు షేకర్, ఉప సర్పంచ్ సింగిరెడ్డి మనోహర్, కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రాకేష్, ధనుంజయ నాయక్ మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు



## వెన్నెల - సాయితేజ వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

రామగిరి, ఏప్రిల్ 30 (ప్రజాతీర్పు)

రామగిరి మండలం సెంటనరీ కాలనీలోని సాయిరాం గార్డెన్‌లో కల్వచర్ల గ్రామానికి చెందిన మంగళారపు రాజయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వెన్నెల – సాయితేజ వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు మంథని మాజీ శాసనసభ్యులు పుట్ట మధూకర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక నాయకులు మరియు పలువురు ఆహ్వానితులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.



## చౌడాలమ్మ విగ్రహ ప్రతిష్ట జాతర మహోత్సవానికి ఆహ్వానం

(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట) ఏప్రిల్ 30


వెల్జీపురం గ్రామంలో మే నెలలో జరిగే శ్రీ చౌడాలమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ని వెల్జీపురం యాదవ సంఘం సభ్యులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ ఏఎంసి డైరెక్టర్ కంకణాల రాంప్రసాద్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు శంకర్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలువేరు స్వామి రెడ్డి యాదవ సంఘం అధ్యక్షుడు నరిగే శ్రీనివాస్ యాదవ్ ఉపాధ్యక్షుడు సలేంద్రి ఆనంద్ యాదవ్ తో పాటు యాదవ సంఘం జక్కుల శ్రీనివాస్ యాదవ్, జుర్ర రాజయ్య యాదవ్, జుర్ర చంద్రయ్య యాదవ్, జక్కుల సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయుల పని తీరు అభినందనీయం

(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) ఏప్రిల్30

పదవ తరగతి పరీక్ష ఫలితాల సాధనలో ఉపాధ్యాయుల పని తీరు అభినందనీయమని సర్పంచి తలారి నాగమణి అన్నారు. రాయికల్ మండలం మైతాపూర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాలలో టాపర్లు గా నిలిచిన విద్యార్థులను సర్పంచి గురువారం సన్మానించారు. అందరు విద్యార్థులు పాస్ కావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రణయ్, ప్రధానోపాధ్యాయులు ముక్కాల మోహన్ రెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ శ్యామల,నాయకుడు తలారి రాజేష్,ఉపాధ్యాయులు వేముల మధులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో పెరిగిన 'టావర్' సర్జరీలు గతేడాదితో పోలిస్తే 34 శాతం వృద్ధి

శేరిలింగంపల్లి , ఏప్రిల్ 30 (ప్రజాతీర్పు)

నగరంలో తక్కువ కోతతో చేసే అధునాతన గుండె శస్త్రచికిత్సలు గతేడాదితో పోలిస్తే 34 శాతం పెరిగాయి. ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వారిలో గుండె ప్రధాన కవాటం ఇరుకుగా మారే అయోర్టిక్ స్టెనోసిస్ సమస్యకు ట్రాన్స్‌క్యాథెటర్ అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ (టావర్) చికిత్స విధానం ప్రాధాన్యం సంతరించుకుంది. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఏటా 350 నుంచి 400 వరకు టావర్ సర్జరీలు జరుగుతున్నాయి. ఆయాసం, అలసట, ఛాతీలో అసౌకర్యం వంటి లక్షణాలను వృద్ధాప్య సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేయరాదని ఏఐజీ హాస్పిటల్స్ కార్డియాక్ క్యాత్ ల్యాబ్ డైరెక్టర్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అనుజ్ కపాడియా, క్యాత్ ల్యాబ్ కో-డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ స్వరూప్ భరడి సూచించారు. ఆధునిక వైద్య సదుపాయాలు, నిపుణులైన వైద్య బృందాల కృషితో గతంలో శస్త్రచికిత్సకు అత్యంత ప్రమాదకరంగా భావించిన రోగులకు సైతం ఇప్పుడు టావర్ విధానం ద్వారా సురక్షితంగా వైద్యం అందిస్తున్నామని, తద్వారా రోగులు త్వరగా కోలుకుంటున్నారని వారు వివరించారు.



## ఐదు రాష్ట్రాలలో బీజేపీ కి అనుకూల ఫలితాలు

- కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్, బిఆర్ఎస్ అవుట్ డేటెడ్ పార్ట
- మే 10న మోదీ సభ ద్వారా తెలంగాణకు దిశానిర్దేశం
- రాజ్యసభ సభ్యుడు, బీజేపీ పార్లమెంటరీ కమిటీ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్

( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఏప్రిల్ 30

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో బీజేపీ కి ఉన్న రిపోర్టు అంచనాలకు అనుగుణంగా గణనీయ విజయాలు సాధిస్తుందని, అంచనాలకు మించిన ఫలితాలు వస్తాయని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ పార్లమెంటరీ కమిటీ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం స్థానిక అదితి హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త మార్పులకు నాంది పలికేలా ఈ నెల 10న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఈనెల భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. చారిత్రక మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్, ఇండియా కూటమి నిజస్వరూపాన్ని బట్టబయలు చేసేలా ఈనెల 10న, "జనాగ్రహ సభ"ను నిర్వహించడానికి బిజెపి తెలంగాణ శాఖ సన్నాహాలు చేస్తుందని అన్నారు. ప్రధాని మోదీ హాజరయ్యే ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది హాజరవుతారని, ఇది తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే సభగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఓ ఫెయిల్యూర్ గవర్నమెంట్ అని ఆయన ఘాటుగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రాన్ని ఏలా నడపాలో అర్థం కాని స్థితిలో పాలన కొనసాగిస్తుందన్నారు. ఇక బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు విఆర్ఎస్ ఇచ్చారని , ఆ పార్టీ అవుట్ డేటెడ్ పార్టీ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రప్రదమంగా కరీంనగర్‌లో తొలి మేయర్‌గా బీజేపీ అభ్యర్థి గెలవడం ప్రజల్లో మార్పు సంకేతమని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో బిజెపిపై ఏనలేని ఆదరణ కనిపిస్తుందని అన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన

(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) ఏప్రిల్ 30



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మక్క పేట్ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో చిప్ప గణేష్ పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న పనులను ఆయన సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గణేష్ కూలీలతో మాట్లాడుతూ పనులను నాణ్యతతో నిర్వహించాలని, కూలీలందరికీ ఓఆర్ఎస్ మరియు మెడికల్ కిట్స్ నిత్యం అందుబాటులో ఉండేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్ మరియు పంచాయతీ కార్యదర్శి ను ఆదేశించారు, ఎండ తీవ్రత నుండి ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. అలాగే ఎక్కువ సంఖ్యలో కూలీలు హాజరై పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా పనులు సక్రమంగా చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నరేందర్ , పంచాయతీ కార్యదర్శి సరిత పాల్గొన్నారు.




## శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

- ముఖ్య అతిథులుగా పాల్గొన్న చామకూర మల్లారెడ్డి, ఈటెల రాజేందర్.

మేడిపల్లి, ఏప్రిల్ 30 ( ప్రజా తీర్పు )

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో ఎన్ఐఎన్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర శివాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. శ్రీ త్రిదండి బృందావన రామానుజ జీయర్ స్వామి శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా ఎంపీ ఈటెల రాజేందర్,ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, మంద సంజీవరెడ్డి,ఇతర ప్రముఖులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఏనుగు ప్రతాప్ రెడ్డి, చైర్మన్ దీటి గణేష్, కాలనీ ప్రెసిడెంట్ మేకల శ్రీనివాస్ గౌడ్,వైస్ చైర్మన్ కొండ ఐలయ్య యాదవ్ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయింది. కాలనీ వాసులు రెడ్డి గారి రమేష్ రెడ్డి, మల్లేష్ యాదవ్, పప్పు సత్యనారాయణ, రచ్చ బిక్షపతి, మర్రి విజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాలనీ భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.

## పదవ తరగతి ఫలితాల్లో శనిగరం విద్యార్థుల ప్రభంజనం



కోహెడ, ఏప్రిల్ 30 (ప్రజాతీర్పు ప్రతినిధి)

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం ఉన్నత పాఠశాల విద్యార్థులు 54 మంది గాను 54 మంది పాసై 100% ఉత్తీర్ణత సాధించారు. కోహెడ మండలంలోనే అందరి విద్యార్థుల కంటే అత్యధిక మార్కులు సాధించి మండల స్థాయిలో కడవ సంజన 579 మార్కులతో ప్రథమ స్థానాన్ని, ఠాకూర్ శ్రీనిధి 577 మార్కులతో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అదేవిధంగా పాఠశాల స్థాయిలో ఇద్దరు అమ్మాయిలు తుప్కారి అక్షయ దుర్గ, సనుఫా తబసమ్ లు 575 మార్కులతో తృతీయ స్థానశీలో నిలిచారు. 550 మార్కులకు పైగా 27 మంది, 500 మార్కులకు పైగా 19 మంది 450 మార్కులకు పైగా 6 గురు 400కు పైగా ఇద్దరు విద్యార్థులు సాధించి మండల,జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, విద్యా బోధన చేసిన ఉపాధ్యాయ బృందాన్ని గ్రామ సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మానువాడ సరళ, ఏఏపిసి చైర్మన్ సిరికొండ శ్యామల, గ్రామస్తులు, తదితరులు అభినందించారు.

## కానామెట్టు చెరువు కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- అధికారుల నిర్లక్ష్యం, హైడ్రా తీరుపై సీపీఐ నేతల మండిపాటు.

శేరిలింగంపల్లి , ఏప్రిల్ 30 (ప్రజాతీర్పు)




?మండల పరిధిలోని కానామెట్టు చెరువును కూకట్‌పల్లి సర్వే నంబర్‌తో కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, టీ రామకృష్ణ డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లిలో కోట్లు విలువచేసే భూములపై కన్నేసిన కబ్జాదారులు లేని సర్వే నంబర్లను సృష్టించి చెరువులు, నాలాలను మాయం చేస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని వారు మండిపడ్డారు. పేదల గుడిసెలను రాత్రికి రాత్రే కూల్చేస్తున్న హైడ్రా అధికారులకు ధనవంతుల అక్రమ నిర్మాణాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఆ నిర్మాణాలను కూల్చివేసి, కబ్జాదారులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని, లేకుంటే వారితో అధికారులు కుమ్మక్కయ్యారని ప్రజలు భావిస్తారని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై కలెక్టర్, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేస్తామని, అప్పటికీ స్పందించకపోతే కోర్టు ద్వారా న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.చందు యాదవ్, కె.వెంకటస్వామి, తుపాకుల రాములు, కాసిం, వెంకటేష్, జెట్టి శ్రీను, తిరుపతయ్య, కిరణ్, బాలస్వామి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మాసాయిపేటలో వరుస దొంగతనాలు - భయాందోళనలో గ్రామ ప్రజలు

- మెయింటెనెన్స్ లేక వృధాగా ఉన్న సీసీ కెమెరాలు.
- మాసాయిపేట్ మండలానికి పోలీస్ స్టేషన్ మోక్షం ఎప్పుడు?

**(వంజరపు ఎల్లం, ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్ ) ఏప్రిల్ 30**



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం మాసాయిపేట మండలం కేంద్రంలో వరుస దొంగతనాలు ప్రజలను తీవ్రమైన భయ ఆందోళనకు గురి అవుతున్నారు గత రాత్రి బుధవారం గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న తులసి కిరాణం , ఇంటిలో ఎవరు లేని సమయంలో దొంగలు ఇంటి, బీరువా తాళం పగలగొట్టి బీరువా నుండి 40 వేల రూపాయల వరకు దోచుకెళ్లారు. రెండు రోజుల క్రితం కచీరు దగ్గర వదనాల ఆంజనేయులు సంబంధించిన ప్యాసింజర్ ఆటో దొంగలు ఎత్తుకెళ్లారు. గతంలో కూడా కిరాణం షాప్, ఫర్టిలైజర్, సాయిబాబా గుడిలో, శివంపేట నాగరాజు, ఏశం శంకర్ ఇండ్లలో కూడా దొంగలు బీభత్సం సృష్టించారు. చేగుంట పోలీస్ ప్రతిరోజు పెట్రోలింగ్, గెస్తి నిర్వహిస్తున్న దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి దీనికి కారణం మాసాయిపేట మండల కేంద్రానికి పూర్తిస్థాయిలో పోలీస్ స్టేషన్ లేకపోవడం. గతంలో ఫిట్టింగ్ చేసిన మెయింటెనెన్స్ లేక సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో దొంగలను గుర్తించలేకపోతున్నారు. గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి తక్షణమే స్పందించి సీసీ కెమెరాలను పునరుద్ధరించాలని మరియు నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి పూర్తిస్థాయిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## నత్తనడకన సాగుతున్న ఎల్లమ్మ దేవాలయ పనులు

### బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మల్లికార్జున్ రెడ్డి

**సిద్దిపేట జిల్లా హుస్నాబాద్, ఏప్రిల్ 30 (ప్రజాతీర్పు)**

కోరిన కోర్కెలు తీర్చే శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర నేటి నుండి ప్రారంభం అవుతున్నా నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మల్లికార్జున్ రెడ్డి అన్నారు. శుక్రవారం నుండి హుస్నాబాద్ లో ఎల్లమ్మ జాతర జరుగుతున్న నేపథ్యంలో నాయకులు దేవాలయ మండపం నిర్మాణం పనులను జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ ఎల్లమ్మ దేవాలయానికి పూర్తిస్థాయి పాలకవర్గం ఎందుకు వేయలేదు అన్నారు. దేవాలయం మండప నిర్మాణం, అనివేటి మండపనిర్మాణ పనులు 2022 డిసెంబర్ లో పనులకు శంకుస్థాపన చేసిన కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తూ శ్రద్ధ చూపడం లేదని అన్నారు. ఎల్లమ్మ దేవాలయానికి సుమారు రూ.50 నిర్మాణం చేపడుతున్న కూడా జాతర వచ్చినప్పుడు మాత్రమే ఉత్సవ కమిటీ వేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటున్నదని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా గెలిచిన మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న కూడా, ఎల్లమ్మ దేవాలయాన్ని అన్నీ తానై నడిపిస్తున్న కూడా ఆలయం పూర్తి చేయడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు? ఎల్లమ్మ దేవాలయాన్ని సందర్శించిన వాళ్లలో పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## మెట్ పల్లి నూతన జడ్జిగా వి మాధవి

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) ఏప్రిల్30**



జగిత్యాల జిల్లా మెట్ పల్లి నూతన జూనియర్ సివిల్ జడ్జి గా వినుకొండ మాధవి పదవీ బాధ్యతలు చేపట్టారు సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న నారం అరుణ్ కుమార్ రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు బదిలీ కాగా ఖమ్మం జిల్లా మూడవ అదనపు కోర్టు మెజిస్ట్రేట్ గా పనిచేస్తున్న మాధవి మెట్ పల్లి కోర్టుకి బదిలీ పై వచ్చారు గురువారం వారు పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి మొక్క అందించి వారికి స్వాగత శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్ క్రీడ కార్యదర్శి నీరటి రమణ జూనియర్ ఈసి మెంబెర్ మాలేపు సంధ్య రాణి, న్యాయవాదులు కోటగిరి వెంకట స్వామి చైతన్య సత్యనారాయణ మన్నె గంగాధర్ ఉన్నారు.



## యూరియా వాడకం తగ్గించి- నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడండి

### రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.

**హుస్నాబాద్, చిగురుమామిడి, ఏప్రిల్ 30 (ప్రజా తీర్పు)**

యూరియా వాడకం తగ్గించి,నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.గురువారం చిగురుమామిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఈ నెల 27 నుండి వచ్చే నెల 23 తేదీ వరకు నిర్వహిస్తుందన్నారు.ఈ కార్యక్రమం ద్వారా సేంద్రియ వ్యవసాయ విధానంపై గ్రామగ్రామాన వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు.60 సంవత్సరాల వ్యవసాయ విశ్వ విద్యాలయంలో అనేక మంది శాస్త్రవేత్తలను పట్టభద్రులు తయారు చేయడమే కాకుండా నూతన వంగడాలు ఆధునిక పద్ధతులపై పరిశోధనలు చేస్తున్నారని,రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆధ్వర్యంలో రైతుల వద్దకే శాస్త్రవేత్తలు వెళ్ళి అధిక దిగుబడి పొందడానికి అవసరమైన వంగడాలు,అధునాతన యంత్రాలు,అవసరమైన ఎరువులపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. సిద్దిపేట జిల్లా మండలంలో నంగునూరు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం చేసుకున్నామని, రైతులు పంట మార్పిడి చేసుకొని ఆయిల్ ఫాం సాగు చేయాలన్నారు. ఆయిల్ ఫాం పంట సాగు ద్వారా అధిక లాభాలున్నాయని తెలిపారు. రైతులు శాస్త్రవేత్తల సలహాలు తీసుకొని చైతన్యవంతం కావాలన్నారు.ఔత్సాహికమైన రైతులకు శిక్షణ ఇవ్వడం వల్ల గ్రామాల్లో వ్యవసాయ మార్పులతో వృద్ధి సాధిస్తారన్నారు.గతంలో వైఎస్సార్ హయాంలో ఆదర్శ రైతు వ్యవస్థ ఉండేదని ఇప్పుడు కూడా ఆదర్శ రైతులకు శిక్షణ ఇచ్చి సాంకేతిక వ్యవసాయ మార్పులతో ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు.గ్రామీణ ప్రాంతాల రైతులు చేరాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. యూనివర్సిటీ శాస్త్రవేత్తలు స్వయంగా మన గ్రామాల్లోకి వచ్చి రైతులకు అవగహన కల్పిస్తున్నారు. సేంద్రీయ ఎరువుల సాగుపై ప్రతి ఒక్క రైతు శాస్త్రవేత్తల సూచనలు సలహాలు పాటించాలన్నారు.ఈ ప్రక్రియ పాటించడం వలన అధిక దిగుబడులతో పాటు ఆరోగ్యకరమైన పంటలు పండించడానికి అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ డిఎం అగ్రికల్చర్ డాక్టర్ ఝాన్సీ రాణి,పిజెటి ఏయు హైదరాబాద్ వసాయ పరిశోధన సహా సంచాలకులు,ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ పొలస డిఎస్ హరీష్ కుమార్ శర్మ,వ్యవసాయ పరిశోధన సంస్థ,కరీంనగర్ ప్రధాన శాస్త్రవేత్త,హెడ్ డాక్టర్ రాంప్రసాద్,తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కరీంనగర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ,బి శాస్త్రవేత్త డాక్టర్ కె మదన్ మోహన్ రెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి,హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్ రెడ్డి, మండల ఉద్యానవన అధికారిని మంజువాణి,వ్యవసాయ విస్తరణ అధికారులు,రైతులు పాల్గొన్నారు.

## బయ్యారం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

### మండలప్రజా పరిషత్ లో కళ్యాణ లక్ష్మి లబ్దిదారులకు ఎమ్మెల్యే చెక్కుల పంపిణి

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు టేకులపల్లి) ఏప్రిల్ 30**



ఇల్లందు :వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బయ్యారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కుల పంపిణీ.వివిధ మండలాల నుండి ట్రాన్స్ఫర్ ద్వారా బయ్యారం మండలంలోని గ్రామాలకు నూతనంగా నియమితులైన గ్రామ కార్యదర్శులతో ఎమ్మెల్యే సమావేశంప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పథకాలను అమలుపరచుకుంటూ ముందుకెళుంది-ఎమ్మెల్యేకోరం కనకయ్య పెదింటి ఆడబిడ్డ పెళ్ళికి కానుకగా రాష్ట్ర ప్రభుత్వం అందించే కళ్యాణ లక్ష్మి,పేద ప్రజలు వైద్య నిమిత్తం ఇచ్చే సీఎంఆర్ఎఫ్ చెక్కులను సి ఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రమం తప్పకుండా ఆర్థిక ఇబ్బందులు ఉన్న అందిస్తుందిరాష్టం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధరకు రైతులు అమ్మకాలు జరపాలి, దళారుల చేతులో మోసపోవద్దు. నూతనంగా నియమితులైన పంచాయితి కార్యదర్శులకు గ్రామాలలో వేసవి దృష్ట్యా త్రాగు నీరు,గ్రామ పరిశు భ్రత,ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఆదేశంబయ్యారం మండలం బయ్యారం గ్రామంలో వ్యవసాయ పరపతి సంఘంలి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రంప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగాహజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించ స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎం ఆర్ వో అధ్యక్షతనఏర్పాటు కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమానికి హజరై 23మంది లబ్ధిధారులకు 23లక్షల116 రుపాయల చెక్కులనులబ్ధిధారులకు పంపిణి చేసిట్రాన్సఫర్ ద్వారా వివిధ మండలాల నుండి బయ్యారం మండలంలోని గ్రామాలకు నూతనంగా నియమితులైనకార్యదర్శులతో సమావేశం నిర్వహించి, గ్రామాలలో పారిశుధ్యం,త్రాగు నీరు,ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలపై దృష్టి సారించాలని ఆదేశించిన శాసన సభ్యులు కోరం కనకయ్య వారి వెంట ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు బయ్యారం సొసైటి మాజీ చైర్మెన్ మూల మధుకర్ రెడ్డి ఇల్లందు మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బిజ్జా వెంకటేశ్వర్లు, బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్, మాజీ సొసైటి చైర్మెన్ తిరుమల ప్రభాకర్ రెడ్డి,వెంకటపతి, కొత్తపేట సర్పంచ్ భుక్యా ప్రవిణ్ నాయక్,నాయకులు గుగులోత్ మంగిలాల్,బాలు,రాందాస్, సేవాలాల్, నాయిని శ్రీనివాస్ రెడ్డి, కొండపల్లి లక్ష్మి పలు గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు



## తహసిల్దార్ కార్యాలయాల్లో ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 30(ప్రజాతీర్పు ):**

తహసిల్దార్ కార్యాలయాల్లో ప్రజలకు మెరుగైన పౌరసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, గురువారం పట్టణంలోని, అర్బన్ తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయానికి సంబంధించిన అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రతీ రిజిస్టరు, రికార్డును పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలు ఆయా పౌర సేవల ధ్రువీకరణ పత్రాలకు చేసుకున్న దరఖాస్తులు వెంట వెంటనే మంజూరు చేయాలని పేర్కొన్నారు. పెండింగ్ పౌర సేవల ధ్రువీకరణ పత్రాల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులంతా ప్రతి రోజు కేంద్ర కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, తహసిల్దార్ రాజు, కార్యాలయ అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



## బాధ్యతాయుతంగా జనగణన పూర్తి చేయాలి

- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు
- వేములవాడలో జనగణన 2027పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్ల శిక్షణ శిబిరం

**(కవ్వాల సురేందర్, ప్రజా తీర్పు, వేములవాడ) ఏప్రిల్ 30**

జనగణన - 2027ను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లు బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. జనగణన 2027 లో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్స్, సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ డిజిటల్ విధానం, స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఆఖరి రోజు శిక్షణ కొనసాగుతుండగా, చైర్మన్ పుల్కం రాజు జన గణనకు సంబంధించిన కిట్లను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ, ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి.. నమోదు చేయాలని, అందరి వివరాలు గోప్యంగా ఉంచాలని, వార్డులలో కుటుంబాల వివరాల సేకరణలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న కౌన్సిలర్లకు గాని వార్డ్ ఆఫీసర్లకు గాని మాకు గాని తెలుపగలరు. ఎండాకాలం నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్ వెంట తీసుకువెళ్లాలని సూచించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎలిమినేటర్స్, ట్రైనర్స్ ఏం.లక్ష్మణ్, తిరుపతి, టెక్నికల్ అసిస్టెంట్ రాకేష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ ఎంత ప్రమాదమో తెలియజేసే చిత్రం.

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) ఏప్రిల్.30**

అంతర్వేదిలో కనిపించిన ఈ దృశ్యం మన సమాజానికి ఒక గట్టి హెచ్చరిక. ప్రాణం ఉన్నప్పుడు ఆహారం కోసం తిరిగిన ఆ పశువు చివరకు మనం విసిరేసిన ప్లాస్టిక్ వ్యర్థాలకు బలైంది. ఆకలితో బాధపడుతూ ఆహారం అనుకొని ప్లాస్టిక్ సంచులను మింగిన ఈ జంతువు తన ప్రాణాలను కోల్పోయింది. శరీరం కుళ్లిపోయినా, అస్థిపంజరం మాత్రమే మిగిలినా, ప్లాస్టిక్ మాత్రం అలాగే కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతిరోజూ మనం నిర్లక్ష్యంగా పారేస్తున్న ప్లాస్టిక్ వల్ల వేలాది జంతువులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. గేదెలు, కుక్కలు, పక్షులు ఇలా ఏజీవి అయినా దీనికి బలి కావచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. ప్లాస్టిక్ మనకు సౌకర్యం ఇచ్చినా, అదే సమయంలో అది ప్రకృతికి శాపంగా మారింది.మనం ఒక్కసారి ఉపయోగించి పారేసే ప్లాస్టిక్ సంచులు, బాటిల్స్ వాటికి ప్రకృతిలో విచ్ఛిన్నం కావడానికి వందల సంవత్సరాలు పడుతుంది. ప్రకృతిని కాపాడటం అంటే మనల్ని మనం కాపాడుకోవడం అనే విషయం మర్చిపోకూడదు....

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020